# సెక్షన్ I



## సంఘటనలు, ప్రక్రియలు

AP SCERT

విభాగం I లో మీరు ఫ్రెంచి విప్లవం, రష్యన్ విప్లవం, నాజిజమ్ ఉన్నతి గురించి చదువుతారు. ఆధునిక ప్రపంచ రూపకల్పనలో వైవిధ్యభరితమైన ఈ సంఘటనలన్నీ ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి.

అధ్యాయం I ఫ్రెంచి విప్లవం గురించి తెలియజేస్తుంది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం వంటి భావాలను తరచుగా మనము సమర్థిస్తాము. కాని ఈ భావనలకు కూడా చరిత్ర ఉందనే అంశం గుర్తుంచుకోవాలి. ఫ్రెంచి విప్లవాన్ని పరిశీలించడం ద్వారా మీరు చరిత్రలోని కొద్ది భాగాన్ని చదువుతారు. ఫ్రెంచి విప్లవం ఫ్రాన్సులో రాచరికం అంతానికి దారితీసింది. విశేష అధికారాలను ఆధారంగా ఉన్న సమాజం కొత్త పాలనా విధానాన్ని దారితీసింది. విప్లవ కాలంలో జరిగిన మానవ హక్కుల ప్రకటన కొత్త శకం రాబోతుందని ప్రకటించింది. ప్రతి వ్యక్తికీ హక్కులు ఉంటాయని, సమానత్వం ఆశించవచ్చునే ఆలోచన రాజకీయ పరిభాష అయ్యింది. స్వేచ్ఛ సమానత్వం అనే ఆలోచనలే కొత్త శకానికి కేంద్రమయ్యాయి. కాని ఇవి వివిద దేశాల్లో వివిధ రకాలుగా అన్వయించబడి పునరాలోచనలకు, పునర్విమర్శలకు గురయ్యాయి. భారతదేశం, చైనా, ఆఫ్రికా, దక్షిణ అమెరికాలలో చెలరేగిన వలసవాద వ్యతిరేక ఉద్యమాలు సహజమైన, విసూత్నమైన ఆలోచనలను రేకెత్తించాయి. కాని 18వ శతాబ్దం చివరి దశలోనే ఈ భావాలకు ప్రాచుర్యం లభించింది.

అధ్యాయం II లో మీరు ఐరోపాలో సామ్యవాద ఆవిర్భావం, అధికారంలో ఉన్న రాజు నికోలస్ – II పదవీచ్యుతులు కావడానికి జరిగిన నాటకీయ పరిణామాల గురించి చదువుతారు. రష్యన్ విప్లవం సమాజాన్ని విభిన్న రీతిలో మార్చడానికి ప్రయత్నించింది. ఇది ఆర్థిక సమానత్వం, కార్మికుల, కర్షకుల సంక్షేమానికి సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తింది. కొత్త సోవియట్ ప్రభుత్వం రూపొందించిన మార్పులు, ఎదుర్కొన్న సమస్యలు, చేపట్టిన చర్యల గురించి ఈ అధ్యాయం తెలియచేస్తుంది. సోవియట్ రష్యా పారిశ్రామికీకరణ, వ్యవసాయ యాంత్రీకరణే లక్ష్యంగా ముందుకు దూసుకుపోయింది. కాని ప్రజాస్వామ్య సమాజం కొనసాగడానికి అవసరమైన పౌరహక్కులను విస్మరించింది.

సంఘటనలు, ప్రక్రియలు

ఏమైనప్పటికీ వివిధ దేశాల వలస వ్యతిరేక ఉద్యమాల్లో సామ్యవాద భావనలు ఒక భాగమయ్యాయి. నేడు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనది. సామ్యవాదం సంక్షోభంలో పడింది. కాని 20వ శతాబ్దంలో సమకాలీన ప్రపంచం రూపుదిద్దుకోడానికి ఒక శక్తిగా మారింది.

విభాగం III మిమ్మల్ని జర్మనీకి తీసుకువెళుతుంది. ఇది నాజిజం రాజకీయాలు, హిట్లర్ ఉన్నతిని సూచిస్తుంది. నాజిజంలో స్త్రీలు, పిల్లల గురించి, పాఠశాలలు, నిర్బంధ శిబిరాల గురించి చదువుతారు. నాజిజం ఏవిధంగా బలహీన వర్గాల జీవించే హక్కును హరించిందీ, యూదులను అణచివేసేందుకు వారి పట్ల వ్యతిరేక భావనల సుదీర్ఘ విధానాలను అనుసరించిందీ, ప్రజాస్వామ్యం, సోషలిజానికి వ్యతిరేకంగా ఎలా అలుపెరగని పోరాటం చేసింది మీరు తెలుసుకుంటారు. కాని నాజిజం ఉన్నతి అనే కథ కేవలం ఊచకోతలు, హత్యలు వంటి నిర్ధిష్ట సంఘటనలే కాదు. ఇవి వివిధ స్థాయిలలో అమలుజరిగిన సుదీర్ఘమైన పోరాటం. కొంతమంది భారతీయులు హిట్లర్ ఆలోచనలపట్ల ముగ్ధులైనారు. కాని చాలామంది నాజిజం ఉన్నతి పట్ల భీతావహులయ్యారు.

ఆధునిక ప్రపంచ చరిత్ర కేవలం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను విశదీరికరించే కథ కాదు. ఇది హింస, దౌర్జన్యం, హత్యలు, మారణకాండల గురించిన కథ కూడా.



AP SCERT

## ఆధ్యాయం - 1

# ఫ్రెంచి విప్లవం

S1W3D8

1789, జూలై 14 ప్రాతః కాలంలో పారిస్ నగరంలో ప్రమాద ఘంటికలు మ్రోగాయి. రాజు సైన్యాన్ని నగరంలోకి చొరబడమని ఆదేశించాడు. అతను పౌరులందరిపై కాల్పులు జరపమని ఆదేశిస్తాడనే ఊహాగానాలు వ్యాపించాయి. సుమారుగా ఏడువేల మంది స్త్రీ పురుషులు టౌనుహాలు ఎదురుగా సమావేశమై జనసైన్యంగా మారాలని నిర్ణయించుకున్నారు. ఆయుధాలను సేకరించడానికి చాలా ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేశారు.

చివరకు, కొన్ని వందల మంది నగర తూర్పు దిశగా పయనించి మందుగుండు సామాగ్రి నిల్వలను సేకరించడం కోసం బాస్టెయిల్ కోట జైలును ముట్టడించారు. అక్కడ నిలువచేయబడిన మందుగుండు సామాగ్రిని సేకరించాలని ఆశించారు. తరువాత జరిగిన సాయుధ పోరాటంలో బాస్టెయిల్ కమాండర్‌ను హతమార్చారు. బందీలుగా ఉన్న ఏడుగురు ఖైదీలను విడుదలచేశారు. రాజు యొక్క నిరంకుశ ధోరణికి ప్రతిరూపమైన బాస్టెయిల్‌ను అందరూ తిరస్కార భావనతో చూసేవారు. కోటను కూల్చివేశారు. దాని రాతి శకలాలు విధ్వంసానికి స్మారకచిహ్నంగా దాచుకోవాలనుకునే వారికి మార్కెట్లో విక్రయించారు.

తరువాత రోజుల్లో పారిస్‌లోను, పరిసర గ్రామీణ ప్రాంతాలలో మరిన్ని విధ్వంసాలు జరిగాయి. చాలా మంది ప్రజలు రొట్టెల ధర పెరుగుదలపై నిరసన వ్యక్తంచేశారు. చాలా కాలం తరువాత చరిత్రకారులు ఈ సంఘటనలను నెమరువేసుకున్నప్పుడు ఫ్రాన్స్ రాజును ఉరితీయడానికి దారితీసిన సంఘటనల పరంపరకు ఇది నాంది అని చెప్పవచ్చు. అయితే ఆ కాలంలో చాలామంది జరగబోయే ఫలితాలను ఊహించలేదు. ఇది ఇలా ఎందుకు జరిగింది?



**పటం - 1 : బాస్టెయిల్ ముట్టడి**
బాస్టెయిల్ ధ్వంసం తర్వాత కళాకారులు ఆ సంఘటనను గుర్తుచేసుకుంటూ ముద్రించిన చిత్రం.

AP SCERT

# 1 18వ శతాబ్దం చివరిలో ఫ్రెంచ్ సమాజం

1774లో బోర్బన్ రాజుల కుటుంబానికి చెందిన లూయీ XVI ఫ్రాన్స్ సింహాసనాన్ని అధిరోహించాడు. అతని వయస్సు 20 సంవత్సరాలు. అతను ఆస్ట్రియా రాజకుమారి మేరి ఆంటోనెట్‌ను వివాహం చేసుకున్నాడు. అతడు కొత్తగా అధికారం చేపట్టేనాటికి ఖజానా ఖాళీగా ఉందని తెలుసుకున్నాడు. సుదీర్ఘకాలం యుద్ధాలు కొనసాగడం కారణంగా ఫ్రాన్స్ ఆర్థిక వనరులు తరిగిపోయాయి. దీనికి తోడు వెర్సయిల్స్‌లోని అతిపెద్ద రాజభవన నిర్వాహణ ఖర్చు భారీగా ఉండేది. లూయీ XVI పాలనలోని ఫ్రాన్స్ తమ ఉమ్మడి శత్రువు అయిన బ్రిటన్ నుంచి అమెరికాలోని 13 వలస ప్రాంతాలు స్వాతంత్ర్యం పొందటంలో సహాయం చేసింది. ఇప్పటికే ఉన్న రెండు బిలియన్ లివర్స్ ఋణానికి యుద్ధం మరో బిలియన్ లివర్స్ ఋణాన్ని జోడించింది. ప్రభుత్వానికి అప్పు ఇచ్చిన రుణ దాతలు ఇప్పుడు రుణాలపై 10% వడ్డీని వసూలు చేయడం ప్రారంభించారు. కాబట్టి ఫ్రెంచ్ ప్రభుత్వం తన బడ్జెట్లో అధిక శాతం వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేయవలసి వచ్చింది. సైన్య నిర్వహణ, న్యాయవ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు విశ్వవిద్యాలయాలు వంటి వాటికి అయ్యే ఖర్చులకోసం ప్రభుత్వానికి పన్నులు పెంచక తప్పింది కాదు. అయితే ఈ చర్య కూడా సరిపోలేదు. 18వ శతాబ్దంలో ఫ్రెంచ్ సమాజం మూడు ఎస్టేట్లుగా విభజింపబడి ఉంది. మూడవ ఎస్టేట్ ప్రజలు మాత్రమే పన్నులు చెల్లించేవారు.

మధ్యయుగం నుంచి కొనసాగుతూ వస్తున్న ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా ఈ ఎస్టేట్‌ల సమాజం ఏర్పడింది. పాత పాలనా విధానం అనే పదాన్ని సాధారణంగా 1789కి ముందు ఫ్రాన్స్ సమాజం, సంస్థలను వివరించడానికి ఉపయోగిస్తారు.

ఫ్రెంచ్ సమాజంలో ఎస్టేట్లు ఎలా ఏర్పడ్డాయో పటం:2 చూపిస్తుంది. దేశ జనాభాలో 90% వరకు రైతాంగమే. అయితే వాళ్లలో చాలా కొద్ది మంది మాత్రమే వారు సాగు చేస్తున్న భూమికి యజమానులుగా ఉండేవారు. సుమారు 60% భూమి కులీనులు, చర్చి, మూడవ ఎస్టేట్ లోని సంపన్నుల ఆధీనంలో ఉండేది. మొదటి రెండు ఎస్టేట్‌ల సభ్యులు అంటే మతాధిపతులు, కులీన వర్గాల వాళ్లు పుట్టుకతోనే కొన్ని ప్రత్యేక హక్కులను కలిగిఉండేవాళ్ళు. రాజ్యానికి పన్ను చెల్లించకుండా మినహాయింపు పొందడం వీటన్నింటిలో ముఖ్యమైనది. కులీన వర్గాలకు మరికొన్ని ఫ్యూడల్ హక్కులు ఉండేవి. దీంట్లో రైతాంగం నుంచి వసూలు చేసే ఫ్యూడల్ పన్నులు, రైతులు ప్రభువుకు సేవలు అందించడం, అతని ఇంటిలోను పొలంలోను పని చేయడం, సైన్యంలో పనిచేయడం, రోడ్లు నిర్మించడంలో పాల్గొనడం వంటి పనులు ఉండేవి.

చర్చి కూడా రైతాంగం నుంచి తన వాటాగా **'టైథ్'** అనే పన్నులను వసూలు చేసేది. చివరకు మూడవ ఎస్టేట్ ప్రజలందరూ ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలి. వీటిల్లో **'టేయిలే'** అనే ప్రత్యక్ష పన్ను నిత్యావసర వస్తువులైన ఉప్పు, పొగాకు వంటి వాటిపై విధించేవారు. ప్రభుత్వ నిర్వహణకు అయ్యే ఖర్చును మూడవ ఎస్టేట్ భరించవలసి వచ్చేది.




*పటం 2 – ఫ్రెంచ్ సమాజంలో ఎస్టేట్లు*
*మూడవ స్టేట్‌లో కొంతమంది ధనికులు కొంతమంది పేదలుగా ఉన్నారని గమనించండి*

**కొత్త పదాలు**

లివర్‌లు–ఫ్రాన్స్‌లో ద్రవ్య కొలమానం (కరెన్సీ), 1794 నుంచి నిలిపివేయబడింది.

మతాధిపతులు–చర్చిలో ప్రత్యేక విధులతో సంబంధం ఉన్న వ్యక్తుల బృందం.

టైథ్–చర్చి విధించిన పన్ను. దీని ప్రకారం వ్యవసాయ ఉత్పత్తిలో పదవ వంతు చర్చికి చెల్లించాలి.

టేయిలే–ప్రభుత్వానికి నేరుగా కట్టే పన్ను.

AP SCERT




ఈ పేదవాడు ధాన్యం, పండ్లు, డబ్బు, సలాడ్ వంటి వన్నీ సమకూరుస్తాడు. దర్పంగా కూర్చున్న ప్రభువు వాటిని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. తన చూపులతోనైనా అతనిని అభినందించడానికి ఇష్టపడడు.

కులీనవర్గం వ్యక్తిని సాలీడుగా, రైతును ఈగగా చూడవచ్చు

దెయ్యం ఎంత ఎక్కువగా కావాలనుకుంటుందో, అతనికి అంత ఎక్కువ ఇవ్వాలి.

***పటం – 3: సాలీడు ఈగ***
అనామకుని చిత్రీకరణ

**కృత్యం**

కళాకారుడు కులీన వర్గ వ్యక్తిని సాలీడుగాను, రైతును ఈగగాను ఎందుకు చిత్రీకరించాడో వివరించండి.

## 1.1 మనుగడ కోసం పోరాటం

1715లో 23 మిలియన్‌లు ఉన్న ఫ్రాన్స్ జనాభా 1789 నాటికి 28 మిలియన్లకు పెరిగింది. దీనివల్ల ఆహార ధాన్యాల డిమాండ్ వేగంగా పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ధాన్యం ఉత్పత్తి పెరగ లేదు. అధిక సంఖ్యాకుల ఆహారమైన రొట్టె ధరలు బాగా పెరిగాయి. చాలామంది కార్మికులు ఫ్యాక్టరీలలో పనిచేసేవారు. వేతనాలు యజమానే నిర్ధారించేవాడు. కానీ ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు ఉండేవి కావు. దీనివలన పేదలు, ధనికుల మధ్య అంతరం పెరిగింది. కరువు కాటకాల వలన పంట తగ్గినప్పుడల్లా పరిస్థితులు అధ్వానమయ్యేవి. ఇది జీవనాధార సంక్షోభానికి దారితీసింది. ఇది ప్రాచీన ఫ్రాన్స్ రాజ్యంలో తరచుగా సంభవించేది.

**కొత్త పదాలు**

జీవనాధార సంక్షోభం – జీవనోపాధికి సంబంధించిన ప్రాథమిక అంశాలు అంతరించిపోతున్న దారుణమైన పరిస్థితి.
అజ్ఞాతవ్యక్తి – పేరు తెలియని వ్యక్తి

AP SCERT

## 1.2 జీవనాధార సంక్షోభం ఎలా ఏర్పడుతుంది?




*చిత్రం – 4 : జీవనాధార సంక్షోభంలో క్రమం*

### కృత్యం

ఈ క్రింది ఇవ్వబడిన పదముల నుండి అనువైన పదాలతో చిత్రం 4 లోని ఖాళీ డబ్బాలను నింపండి. ఆహారం కోసం పోరాటం, ఆహారధాన్యాల కొరత, మరణాల సంఖ్య పెరగడం, పెరుగుతున్న ఆహార ధరలు, బక్కచిక్కిన శరీరాలు.

## 1.3 పెరుగుతున్న మధ్యతరగతి – ప్రత్యేక హక్కులకు చరమగీతం.

పెరుగుతున్న పన్నులు, ఆహార కొరతకు వ్యతిరేకంగా గతంలో కూడా రైతాంగం, కార్మికులు తిరుగుబాటులో పాల్గొన్నారు. అయితే సామాజిక, ఆర్థిక వ్యవస్థలో పూర్తిస్థాయి మార్పు తీసుకురాగల చర్యలను చేపట్టలేకపోయారు. మూడవ ఎస్టేట్‌లోని కొంతమంది సంపన్నులు, కొత్త ఆలోచనలు కలిగిన విద్యావంతులు ఈ బాధ్యత వహించారు.

18 వ శతాబ్దంలో మధ్యతరగతిగా వ్యవహరించబడే సామాజిక వర్గాలు ఏర్పడ్డాయి. పెరుగుతున్న విదేశీ వాణిజ్యం పెరగడం, ఉన్ని, పట్టువస్త్రాల తయారీ వంటి వాటి ద్వారా వీళ్లు సంపన్నులయ్యారు. ఈ వస్తువులను ఎగుమతి చేసేవారు లేదా వీటిని ఉన్నత వర్గాలవారు కొనేవారు. మూడవ ఎస్టేట్‌లో వ్యాపారస్తులు, వస్తు ఉత్పత్తిదారులతో పాటు కాకుండా న్యాయవాదులు, పాలనా నిర్వహణాధికారులు, వృత్తినిపుణులు కూడా ఉండేవాళ్లు. వీళ్ళందరూ విద్యావంతులు. సమాజంలో ఏ సమూహం పుట్టుకతో ప్రత్యేక హోదా, హక్కులు కలిగి ఉండరని వీళ్ళు నమ్మేవారు. ఒక వ్యక్తి ప్రతిభను బట్టి అతని సామాజిక హోదా నిర్ణయింపబడాలి. జాన్ లాక్, జీన్ జాక్వెస్, రూసో వంటి తత్వవేత్తలు ప్రతిపాదించిన – అందరికీ స్వాతంత్రం, సమన్యాయం, సమాన అవకాశాలు ఉండేసమాజం ఏర్పడాలి అనే ఆలోచనలు ముందుకు తెచ్చారు. జాన్ లాక్ రాచరికం దైవదత్తమని, రాజే సర్వస్వం అనే సిద్ధాంతాన్ని తన *Two Treatises of Government,* అన్న వ్యాసంలో ఖండించాడు.

AP SCERT

రూసో ఈ భావనను మరింత ముందుకు తీసుకువెళుతూ ప్రజలు వారి ప్రతినిధుల మధ్య సామాజిక ఒప్పందంపై ఏర్పడిన సమాజాన్ని ప్రతిపాదించాడు. మాంటేస్క్యూ తన *The Spirit of the Laws,* అనే గ్రంథంలో ప్రభుత్వంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయవిభాగాల మధ్య అధికార విభజనను ప్రతిపాదించాడు. ఈ రకమైన ప్రభుత్వ విధానాన్ని బ్రిటన్ నుంచి స్వాతంత్రం పొందిన అమెరికాలోని 13 రాష్ట్రాలు అమలుపరిచాయి. అమెరికా రాజ్యాంగం, కల్పించిన వ్యక్తిగత హక్కులకు హామీ ఇవ్వడం అనేది ఫ్రాన్స్‌లోని రాజకీయ మేధావులకు ఆదర్శంగా నిలిచింది.

సెలూన్లు, కాఫీ దుకాణాలలో ఈ తత్వవేత్తల ఆలోచనలు, అభిప్రాయాలపై తీవ్రంగా చర్చించేవారు. పుస్తకాలు వార్తాపత్రికల ద్వారా ఈ అభిప్రాయాలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. చదవటం, రాయటం రాని వారి కోసమని వీటిని తరచూ బిగ్గరగా చదివి వినిపించేవారు. ప్రభుత్వ ఖర్చులను భరించటానికి లూయీ XVI మరిన్ని పన్నులు విధించబోతున్నాడు అన్న వార్త తెలిసి ఈ ప్రత్యేక హక్కుల వ్యవస్థపై నిరసన, కోపం తీవ్రస్థాయికి చేరుకున్నాయి.

AP SCERT

మూలం : *A*

**పాతపాలనలో ప్రజల జీవిత అనుభవాలు**

1. విప్లవ రాజకీయాల్లో క్రియాశీలకుడిగా మారిన జార్జ్ డాంటన్, 1793లో తన విద్యాభ్యాసాన్ని అప్పుడే ముగించిన కాలంనాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ ఒక స్నేహితునికి ఇలా రాశాడు.

నేను ప్లేసిస్ లోని రెసిడెన్షియల్ కాలేజీలో చదువుకున్నాను. అక్కడ నేను ప్రముఖ వ్యక్తుల సహవాసంలో ఉన్నాను. నా విద్యాభ్యాసం ముగిసే నాటికి నావద్ద ఏమీ లేదు. నేను ఉద్యోగం కోసం వెతకడం ప్రారంభించాను. ప్యారిస్ లోని న్యాయస్థానాలలో ఉద్యోగం పొందడం అసాధ్యం. నేను పుట్టుకతో కులీనుని కాను, నాకు సంరక్షకులు లేనందున, సైన్యంలో ఉద్యోగం సంపాదించే అవకాశం లేదు. చర్చి కూడా నాకు ఆశ్రయం ఇవ్వలేదు. నా దగ్గర 'సౌ' లు లేకపోవడంతో ఆఫీసు కొనలేకపోయాను. నా పాత స్నేహితులు నన్ను విడిచిపెట్టేశారు. మన ప్రతిభ ఏ రంగానికి ఉపయోగపడని విద్యను ఈ వ్యవస్థ అందించింది.

2. ఆర్థర్ యంగ్ అనే ఒక ఆంగ్లేయుడు 1787 నుండి 1789 సంవత్సరాలలో ఫ్రాన్స్ గుండా ప్రయాణిస్తూ తన ప్రయాణం గురించి వివరణాత్మకంగా వర్ణించాడు. తరచుగా అతను చూసిన వాటి గురించి వ్యాఖ్యానించాడు.

అతను తన బానిసలపట్ల చులకనగా వ్యవహరిస్తూ వారిచే సేవ చేయించుకోవాలని, వారు తమ కోసం ఎదురుచూస్తూ ఉండాలని ఆశించేవాడు తన బానిసలు మంచి ప్రవర్తన కలవారైనప్పటికీ తన ఆస్తిని, సంపదను తను ఉన్న పరిస్థితికన్నా భిన్నమైన పరిస్థితిలో ఉంచుకుంటున్నాడనే విషయం అర్థం చేసుకోవాలి. లేదా బానిసలు బాధలలో ఉండగా తాను సుఖంగా భోజనం చేస్తూ ఉండేవాడు, తన కుమార్తె అపహరింపబడినా తన కుమారుని గొంతు కోయబడినా ఫిర్యాదు చేయకూడదు.

ఆధారం

**కృత్యం**

'యంగ్' ఇక్కడ మనకు ఇచ్చే సందేశం ఏమిటి? ఆయన బానిసలు అని ఎవరిని అన్నాడు? ఆయన ఎవరిని విమర్శిస్తున్నాడు? 1787లో ఆయన పసిగట్టిన ప్రమాదాలు ఏమిటి?

## 2 విప్లవం ఆరంభం

ముందు భాగంలో లూయి XVI పన్నులను పెంచుటకు గల కారణాలను మీరు తెలుసుకున్నారు. అతడు దీన్ని ఎలా అమలులోకి తెచ్చి ఉంటాడు అని మీరు అనుకుంటున్నారు? ఫ్రాన్స్ లోని పాత పాలనలో రాజు ఒక్కడే తన ఇష్టానుసారం పన్నులు విధించే అధికారం లేదు. రాజు ఎస్టేట్స్ జనరల్స్‌ని సమావేశపరిచి కొత్త పన్నుల అమలుకు ఆమోదాన్ని పొందాలి. ఈ ఎస్టేట్స్ జనరల్ అనే రాజకీయ సంస్థకు మూడు ఎస్టేట్లు తమ ప్రతినిధులను పంపుతారు. అయితే దీన్ని ఎప్పుడు సమావేశపరచాలో రాజు మాత్రమే నిర్ణయిస్తాడు. ఎస్టేట్స్ జనరల్ ఆఖరి సమావేశం 1614లో జరిగింది.

1789 మే 5న కొత్త పన్నుల ప్రతిపాదనను ఆమోదించడానికి లూయీ XVI ఎస్టేట్స్ జనరల్‌ను సమావేశపరిచాడు. ప్రతినిధుల సమావేశం కోసం వెర్సైల్స్ మందిరాన్ని తీర్చిదిద్దారు. ఒకటి, రెండు ఎస్టేట్లు ఒక్కొక్కటి మూడు వందల మంది ప్రతినిధులను పంపించాయి. వీళ్లు రెండు వైపులా ఎదురెదురుగా కూర్చున్నారు. మూడవ స్టేట్ కి చెందిన 600 మంది ప్రతినిధులు వెనకవైపు నిలబడవలసి వచ్చింది. మూడవ ఎస్టేట్లో సంపన్నులు, విద్యావంతులైన వాళ్లకే ప్రాతినిధ్యం దక్కింది. రైతులు, కళాకారులు, మహిళలకు శాసనసభలో ప్రవేశానికి అనుమతించలేదు. అయితే వాళ్ల సమస్యలు, కోరికలను 40 వేల ఉత్తరాల రూపంలో వాళ్ల ప్రతినిధులు తీసుకుని వచ్చారు.

ప్రతి ఎస్టేట్‌కు ఒక ఓటు అనే సూత్రం ప్రకారం గతంలో ఎస్టేట్స్ జనరల్‌కు ఓటింగ్ నిర్వహించబడింది. ఈసారి కూడా అదే పద్ధతిని కొనసాగించాలని లూయిXVI నిశ్చయించుకున్నాడు. అయితే మూడవ ఎస్టేట్ సభ్యులు ఇప్పుడు ఓటింగ్‌ని అసెంబ్లీ మొత్తానికి నిర్వహించాలని, ప్రతి సభ్యునికి ఒక ఓటు ఉండాలని పట్టుబట్టారు. రూసో వంటి తత్వవేత్తలు తన గ్రంథం 'ది సోషల్ కాంట్రాక్ట్' లో ప్రతిపాదించిన ప్రజాస్వామ్య సూత్రాలలో ఇది ఒకటి. రాజు ఈ ప్రతిపాదనను తిరస్కరించడంతో మూడవ ఎస్టేట్ సభ్యులు తమ నిరసనను తెలియజేయటానికి సభ నుండి బయటకు వచ్చారు.

మూడవ ఎస్టేట్ ప్రతినిధులు తమను తాము ఫ్రెంచి దేశమంతటికి ప్రతినిధులుగా భావించసాగారు. వెర్సైల్స్‌లోని టెన్నిస్ కోర్టు మైదానంలో జూన్ 20న వీళ్ళందరూ సమావేశమయ్యారు. వాళ్లు తమను తాము జాతీయ శాసన సభగా ప్రకటించుకున్నారు. చక్రవర్తి అధికారాలను పరిమితం చేసే ఫ్రాన్స్ రాజ్యాంగాన్ని రూపొందించేంతవరకు తాము ఇక్కడి నుండి వెళ్ళమని ప్రతిజ్ఞ చేశారు. వారికి మిరాబ్యూ, అబ్బేసియేస్ నాయకత్వం వహించారు. మిరాబ్యూ ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. అయితే భూస్వామ్య హక్కుతో కూడిన సమాజాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని నమ్మాడు. అతను ఒక పత్రికను ప్రారంభించాడు. వెర్సైల్స్‌లో సమావేశమైన ప్రజలను ఉద్దేశించి ఉత్తేజపూరిత ప్రసంగాలు చేశాడు. అబ్బేసియెస్ వాస్తవానికి ఒక మతాధికారి. మూడవ ఎస్టేట్ అంటే ఏమిటి? అనే ప్రభావవంతమైన కరపత్రాన్ని

**కొన్ని ముఖ్యమైన తేదీలు**

1774 : లూయి XVI ఫ్రాన్స్ రాజు అయ్యాడు. ఖాళీ ఖజానాలను, పాతపాలన వలన సమాజంలో పెరుగుతున్న అసంతృప్తిని ఎదుర్కొన్నాడు.

1789 : ఎస్టేట్ జనరల్ సమావేశం, మూడవ ఎస్టేట్ జాతీయ శాసనసభగా ఏర్పాటు అవ్వడం, బాస్టిల్ కోటపై దాడి, గ్రామీణ ప్రాంతాల్లో రైతుల తిరుగుబాట్లు.

1791 : రాజు యొక్క అధికారాలను పరిమితం చేస్తూ, ప్రజలందరికీ ప్రాథమిక హక్కులకు హామీ ఇస్తూ ఫ్రాన్స్ రాజ్యాంగం రూపొందించబడింది.

1792 నుండి 93: ఫ్రాన్స్‌లో రిపబ్లిక్ ఏర్పాటు జాకోబిన్ రిపబ్లిక్‌ను కూలదోయడం ఫ్రాన్స్‌లో డైరెక్టరీ పరిపాలన 1804 నెపోలియన్ ఫ్రాన్స్ చక్రవర్తిగా ప్రకటించుకొనుట.

1815 : వాటర్లూ యుద్ధంలో నెపోలియన్ ఓడిపోవుట.

**కృత్యం**

శాసనసభ అధ్యక్షుడు బెయిలీ టేబుల్ మధ్యలో నిలబడి ఉండగా మూడవ ఎస్టేట్ సభ్యులు చేతులు చాచి ప్రతిజ్ఞ చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులలో బెయిలీ సమావేశమైన సహాయకులకు మద్దతుగా నిలబడి ఉండేవాడని మీరు అనుకుంటున్నారా? బెయిలీని ఆ విధంగా చిత్రీకరించడంలో డేవిడ్ ఉద్దేశం ఏమిటి?

AP SCERT



*చిత్రం – 5 :* ***టెన్నిస్ కోర్టు ప్రతిజ్ఞ.***
*జాతీయ శాసనసభలో పెడదామని చిత్రీకరించిన జాక్వెస్ లూయీ డేవిడ్ వేసిన పెద్ద పెయింటింగ్*

రూపొందించాడు. జాతీయ శాసనసభ వెర్సయిల్ రాజ్యాంగ నిర్మాణంలో తలమునకలై ఉండగా మిగిలిన ఫ్రాన్స్ అంతా అలజడి చెలరేగింది. విపరీతమైన చలి వలన పంటలు పండలేదు. దాంతో రొట్టెల ధర పెరిగిపోయింది. ఈ పరిస్థితిని ఉపయోగించుకుని లాభ పడటానికి తరచూ రొట్టె తయారీదారులు సరుకును నిల్వ చేయసాగారు. దుకాణాల ముందు గంటలకొద్దీ వేచి కోపోద్రిక్తులైన మహిళలు దుకాణాల్లోకి చొరబడ్డారు. అదే సమయంలో సైన్యాన్ని పారిస్ దిశగా కదలాలని రాజు ఆదేశించాడు. ఆందోళనకారులు జూలై 14న బాస్టిల్ కారాగారంపై దాడి చేసి దానిని ధ్వంసం చేశారు.

ఈలోగా పల్లెప్రాంతాల్లో పండిన పంటలను నాశనం చేయడానికి ప్రభువులు దోపిడీ దొంగల ముఠాలను కిరాయికి నియమించారనే వదంతులు గ్రామం నుండి గ్రామానికి వ్యాపించాయి. భయంతో ఉన్మాదానికి లోనైన రైతాంగం అనేక జిల్లాల్లో కత్తులు, పలుగులు తీసుకుని ఛాటోల మీద దాడి చేశారు. అక్కడ ఆహార నిల్వలను దోచుకున్నారు. ప్రభువులకు చెల్లించవలసిన అప్పుల వివరాలకు సంబంధించిన పత్రాలను తగలబెట్టారు. కులీన వర్గానికి చెందిన అనేకమంది తమ ఇళ్ల నుండి పారిపోయారు. వీరిలో చాలామంది విదేశాలకు వలసపోయారు.

తన ప్రజల తిరుగుబాటు తీవ్రతను చూసిన లూయీ XVI చివరికి జాతీయ శాసనసభను గుర్తిస్తున్నట్లు ప్రకటించాడు. తన అధికారాలకు రాజ్యాంగం పరిమితులు విధిస్తుందనే సూత్రానికి అతను కట్టుబడ్డాడు. 1789 ఆగస్టు 4 రాత్రి పన్నులు, వెట్టి చాకిరీకి సంబంధించిన ఫ్యూడల్ వ్యవస్థను రద్దు చేస్తూ శాసనసభ ఆదేశాలను జారీ చేసింది. మతాధికారులు కూడా తమ ప్రత్యేక హోదాను వదులుకోవలసి వచ్చింది. దశమభాగాలను రద్దు చేశారు. చర్చి ఆధీనంలోని భూములను జప్తు చేశారు. దీంతో ప్రభుత్వానికి కనీసం 2 బిలియన్ లివర్ల విలువ చేసే ఆస్తులు సమకూరాయి.




***చిత్రం–6: గొప్ప భీతి వ్యాపించడం***
*ఈ చిత్రం రైతు సంఘాలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వ్యాపించడం*

**కొత్త పదాలు**

చాటో–రాజు లేదా కులీన వ్యక్తికి చెందిన కోట లేదా ప్రాసాదం.

మానర్–ప్రభువుల భూములు, అంతఃపురం ఉన్న ప్రాంతం.

AP SCERT

## 2.1 రాజ్యాంగబద్ధ రాచరికంగా ఫ్రాన్స్

జాతీయ శాసనసభ 1791లో రాజ్యాంగ ముసాయిదా తయారు చేసింది. రాచరిక అధికారాలను పరిమితం చేయటం దీని ప్రధాన ఉద్దేశం. ఈ అధికారాలు ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృతం కాకుండా శాసనసభ, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల మధ్య వికేంద్రీకరించబడ్డాయి. దీని వల్ల ఫ్రాన్స్ రాజ్యాంగబద్ధ రాచరిక దేశంగా మారింది. పటం 7 కొత్త రాజకీయ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలియజేస్తుంది.




*చిత్రం 7 : రాజ్యాంగం ప్రకారం 1791 నాటి ఫ్రెంచి పరిపాలనా వ్యవస్థ.*

AP SCERT

1791 నాటి రాజ్యాంగం పరోక్షంగా ఎన్నికైన జాతీయ శాసనసభకు చట్టాలను చేసే అధికారాన్ని ఇచ్చింది. పౌరులు ఒక సమూహాన్ని ఎన్నుకుంటారు. వారు శాసనసభ సభ్యులను ఎన్నుకుంటారు. అయితే పౌరులందరికీ ఓటు హక్కు లేదు. 25 సంవత్సరాల వయసు పైబడి, కనీసం మూడు రోజుల కార్మిక వేతనానికి సమానమైన పన్నులు చెల్లిస్తున్న పురుషులు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. అంటే ఓటు వేసే హక్కు వీళ్ళకు మాత్రమే ఉంది. మిగిలిన పురుషులను, స్త్రీలనందరినీ నిష్క్రియా పౌరులుగా వర్గీకరించారు. వాళ్ల నుంచి శాసనసభ సభ్యునిగా ఎన్నికవ్వటానికి అధిక మొత్తంలో పన్ను చెల్లిస్తున్న వాళ్ళు మాత్రమే అర్హులు.




*చిత్రం – 8: మానవ పౌరహక్కుల ప్రకటన*
*1790లో లేబార్బియర్ అనే కళాకారుడు చిత్రీకరించాడు. కుడివైపున ఉన్న బొమ్మ ఫ్రాన్స్‌ను సూచిస్తుంది. ఎడమవైపు ఉన్న బొమ్మ చట్టానికి చిహ్నం.*

రాజ్యాంగము మానవ, పౌర హక్కుల ప్రకటనతో ప్రారంభమవుతుంది. జీవించే హక్కు, వాక్‌స్వాతంత్ర్యపు హక్కు, భావప్రకటన, అభిప్రాయాలను వెలిబుచ్చే స్వేచ్ఛ, చట్టం ముందు అందరూ సమానులే అనే భావన వ్యక్తికి పుట్టుకతో సంక్రమించే 'సహజమైన విడదీయరాని' హక్కులుగా ప్రస్తావించబడ్డాయి. ఇవి ప్రతి వ్యక్తికి పుట్టుకతో వర్తిస్తాయి. ఎవరూ వీనిని తీసివేయలేరు. పౌరుల సహజ హక్కులను పరిరక్షించడం రాజ్యం యొక్క బాధ్యత.

**మూలం B**

విప్లవాత్మక పాత్రికేయుడు జీన్ పాల్ మరాట్ తన వార్తాపత్రిక పేరు 'లామి డూ పీపుల్' (ప్రజల స్నేహితుడు) లో జాతీయ శాసనసభ రూపొందించిన రాజ్యాంగంపై ఇలా వ్యాఖ్యానించాడు.



'ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పని సంపన్నులదే. ఇప్పుడు పేదలు, అణచివేతకు గురైన వారు శాంతియుత మార్గాల ద్వారా ఎప్పటికీ మెరుగుపడరు. సంపద చట్టాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో ఇక్కడ ఋజువుగా ఉంది. ప్రజలు అంగీకరించినంత కాలం మాత్రమే చట్టాలు ఉంటాయి. వారు ప్రభువుల బంధనాలను త్యజించగలిగితే ఇతర సంపన్నులకు ఇదే వర్తిస్తుంది.

మూలం: 'లామి డూ పీపుల్' వార్తాపత్రిక నుండి సంగ్రహణ

**మూలం C**

## మానవ పౌరుహక్కుల ప్రకటన

1. మానవులు స్వేచ్ఛా జీవులుగా జన్మించారు. స్వేచ్ఛగా ఉంటారు. హక్కులు అందరికీ సమానంగా వర్తిస్తాయి.
2. వ్యక్తియొక్క సహజ, విడదీయరాని హక్కులను సంరక్షించడమే రాజకీయ సంఘాల లక్ష్యం. అవి: స్వేచ్ఛ, ఆస్తి, భద్రత, అణచివేతను ప్రతిఘటించడం.
3. సార్వభౌమత్వ మూలాలు దేశంలో ఉంటాయి. పౌరుల అంగీకారం పొందని వ్యక్తిగాని, సమూహం గాని అధికారం చెలాయించకూడదు.
4. స్వేచ్ఛ అంటే ఇతరులకు హాని కలిగించని విధంగా ప్రవర్తించడం.
5. సమాజానికి హాని కలిగించే చర్యలను నిషేధించే అధికారం చట్టానికి ఉంటుంది.
6. అందరి అభిప్రాయాలను వ్యక్తపరిచేదే చట్టం. దాని తయారీలో పౌరులందరూ ప్రత్యక్షంగా కానీ లేదా తమ ప్రతినిధుల ద్వారా కానీ పాల్గొనవచ్చు దాని ముందు పౌరులందరూ సమానమే.
7. చట్టం నిర్ణయించిన సందర్భాలలో తప్ప ఏ వ్యక్తిని నిందించడం, అరెస్టు చేయడం, నిర్బంధించడం చేయకూడదు.
11. ప్రతి పౌరునికి స్వేచ్ఛగా మాట్లాడే, రాసే ప్రచురించే హక్కు ఉంది. చట్టం నిర్ణయించిన ప్రకారం ఇటువంటి స్వేచ్ఛను దుర్వినియోగ పరిచినట్లయితే అతడు బాధ్యత వహించాలి.
12. పరిపాలనా వ్యవస్థ ఖర్చులకు ప్రజాసైన్యాన్ని నిర్వహించటానికి, అందరికీ పన్నులు విధించడం తప్పనిసరి. వాళ్లకున్న ఆస్తుల నిష్పత్తిలో వీటిని పౌరులందరికీ వర్తింపచేయాలి.
17. ఆస్తి అనేది పవిత్రమైనది, ఉల్లంఘించలేని హక్కు కనుక చట్టబద్ధమైన ప్రజా ప్రయోజనాలకు అవసరమైనప్పుడు తప్పించి ఎవరికీ మినహాయింపు లేదు. అటువంటి సందర్భాలలో న్యాయమైన నష్ట పరిహారాన్ని ముందుగా చెల్లించాలి.

AP SCERT

## రాజకీయ సంకేతాలను చదవడం

18వ శతాబ్దంలో ఎక్కువమంది పురుషులు, మహిళలు చదవడం, రాయడం రానివారు. అందువలన ముఖ్యమైన ఆలోచనలను తెలియజేయడానికి ముద్రిత పదాలకు బదులుగా చిత్రాలను, చిహ్నాలను తరచుగా ఉపయోగించేవారు. లీ బార్బియర్ గీసిన పటం:8 లో హక్కుల ప్రకటనలోని అంశాలను తెలియజేయడానికి ఇటువంటి అనేక చిహ్నాలను ఉపయోగించడం జరిగింది. ఈ చిహ్నాలను చదవడానికి ప్రయత్నిద్దాం

**విచ్ఛిన్న గొలుసు:** బానిసలకు సంకెళ్లు వేయడానికి గొలుసులు ఉపయోగించబడ్డాయి. విచ్ఛిన్నమైన గొలుసు స్వేచ్ఛకు సంకేతంగా సూచించారు.



**కడ్డీల కట్ట :** ఒక కడ్డీ సులభంగా విరిగిపోతుంది. కానీ కడ్డీల కట్టను విరవలేము. ఐకమత్యమే బలం.





**కాంతిని ప్రసరించే త్రిభుజంలో కన్ను:** అన్నింటినీ చూసే కన్ను జ్ఞానానికి సంకేతం. సూర్యకిరణాలు అజ్ఞాన మేఘాలను దూరం చేస్తాయి.



**రాజదండం:** రాజు శక్తికి చిహ్నం.



**పాము తన తోకను కొరికి ఉంగరంగా ఏర్పరచడం :** ఉంగరం శాశ్వత తత్వానికి చిహ్నం. దానికి మొదలు చివర లేవు.

AP SCERT



**స్వాతంత్ర సాధనను సూచించే ఎర్ర టోపీ :** బానిసలు స్వేచ్ఛగా మారిన తర్వాత వారు ధరించే టోపీ.



**నీలం–తెలుపు–ఎరుపు :** ఫ్రాన్స్ జాతీయ రంగులు.



**రెక్కలుగల స్త్రీ :** చట్టానికి ప్రతిరూపం

**లా టాబ్లెట్ :** చట్టం అందరికీ సమానమే. దాని ముందు అందరూ సమానులే.



## కృత్యం

1. బాక్సు 1లో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని సూచించే చిహ్నాలను గుర్తించండి.
2. చిత్రం 8 లోని చిహ్నాలను చదవడం ద్వారా 'మానవ, పౌరహక్కుల ప్రకటన' అర్థాన్ని వివరించండి.
3. ప్రకటన 1,6 ఆర్టికల్స్‌ల ద్వారా 1791 రాజ్యాంగము పౌరులకు ఇచ్చిన రాజకీయ హక్కులను పోల్చండి. (మూలం C) రెండు పత్రాలు ఒకేలా ఉన్నాయా? రెండు పత్రాలు ఒకే భావనను తెలియ జేస్తున్నాయా?
4. 1791 రాజ్యాంగం వలన ఫ్రెంచ్ సమాజంలోని ఏ సమూహాలు లాభపడ్డాయి? ఏ సమూహాలు అసంతృప్తికి లోనయ్యాయి? మరాట్ భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు వస్తాయని ఊహించింది.
5. ఫ్రాన్స్‌లోని సంఘటనలు పొరుగు రాచరికపు దేశాలైన ప్రష్యా, ఆస్ట్రియా, హంగేరీ, స్పెయిన్ దేశాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపి ఉంటాయో ఊహించండి. ఈ దేశాలలోని రాజులు వ్యాపారులు, రైతులు, ప్రభువులు, మతాచార్యులు జరుగుతున్న పరిణామాల గురించిన వార్తలకు ఎలా స్పందించి ఉంటారు?

APSCERT

## 3 రాచరికం రద్దుకాబడి రిపబ్లిక్‌గా మారిన ఫ్రాన్స్

ఆ తరువాత సంవత్సరాలలో కూడా ఫ్రాన్స్‌లోని పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. లూయి XVI రాజ్యాంగంపై సంతకం చేసినప్పటికీ అతను ప్రష్యారాజుతో రహస్య మంతనాలు చేపట్టాడు. ఇతర పొరుగు దేశాల పాలకులు కూడా ఫ్రాన్స్‌లోని పరిణామాలతో ఆందోళన చెందారు. 1789 వేసవి నుండి అక్కడ జరుగుతున్న సంఘటనలను అణిచివేసేందుకు ఇరుగు పొరుగు రాజ్యాల వారు తమ సైన్యాలను పంపించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది జరిగే లోపలే 1792 ఏప్రిల్‌లో ఏర్పాటైన జాతీయ శాసనసభ ప్రష్యా, ఆస్ట్రియాలపై యుద్ధం ప్రకటించింది. సైన్యంలో చేరటానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వారు దీనిని ఐరోపా అంతట రాజులు, ప్రభువులకు వ్యతిరేకంగా చెలరేగిన ప్రజాయుద్ధంలా భావించారు. వారు పాడిన దేశభక్తి గీతాలలో కవి రోగేట్ డి ఎల్ ఐల్ స్వరపరిచిన మార్సైయిల్స్ కూడా ఉంది. మార్సైయిల్స్ పాటను మొదటిసారి స్వచ్ఛంద సేవకులు మార్సైయిల్స్ నుండి ప్యారిస్ లోకి వెళ్ళినప్పుడు ఆలపించారు. అందుకే దానికి ఆ పేరు వచ్చింది. మార్సైయిల్స్ ఇప్పుడు ఫ్రాన్స్ జాతీయ గీతం.

తిరుగుబాటు యుద్ధాలు ప్రజలకు నష్టాలను ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెట్టాయి. పురుషులు యుద్ధాలలో ఉండగా స్త్రీలు జీవనోపాధి చూసుకొని వారి కుటుంబ పోషణాభారం వహించవలసి వచ్చింది. 1791 నాటి రాజ్యాంగం సమాజంలోని ధనిక వర్గాలకు మాత్రమే రాజకీయ హక్కులను కల్పించింది. కాబట్టి విప్లవం మరింత ముందుకు సాగాలని జనాభాలోని అధిక శాతం ప్రజలు భావించారు. ప్రభుత్వ విధానాలను చర్చించటానికి తమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవడానికి ప్రజలకు రాజకీయ క్లబ్బులు ముఖ్యవేదికలైనాయి. వీటిల్లో చాలా విజయవంతమైనవి జాకోబిన్స్ క్లబ్బులు. పారిస్ లోని ఒకప్పటి మత సంఘం సెయింట్‌జాకబ్ పేరు మీదుగా దానికి ఆ పేరు వచ్చింది. ఈ కాలంలో మహిళలు చురుగ్గా ఉన్నారు. వారు తమ సొంత క్లబ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ అధ్యాయంలోని సెక్షన్ 4 వారి కార్యకలాపాలు, కోరికల గురించి మీకు మరింత తెలియజేస్తుంది.

సమాజంలోని పేద ప్రజలు ప్రధానంగా జాకోబిన్ క్లబ్ సభ్యులుగా ఉండేవారు. వీరిలో చిన్న దుకాణదారులు, చెప్పులు తయారుచేసేవారు, పిండి వంటలు చేసేవారు, వాచీలు తయారు చేసేవారు, ప్రింటర్లు, సేవకులు, దినసరి కూలీలు, కళాకారులు ఉండేవారు. వాళ్ళ నాయకుడు మాక్సిమిలియన్ రోబెస్పియర్. జాకోబిన్స్‌లోని ఒక పెద్ద వర్గం డాక్ కార్మికులు ధరించే పొడవాటి చారల ప్యాంటు ధరించాలని నిర్ణయించారు. ఇది వారిని సమాజంలోని నాగరిక వర్గాల సభ్యులు ప్రత్యేకంగా మోకాలి బ్రీచ్‌లు ధరించే ప్రభువుల నుండి తమను తాము

**నూతన పదాలు**

కాన్వెంటు – మతపర జీవితానికి అంకితమైన ప్రజలకు చెందిన భవనం.



పటం: 9 సాన్స్ – కులోట్స్ జంట

AP SCERT



**పటం 10: ననీన్ వెలైన్ లిబర్టీ**
*మహిళా కళాకారిణి గీసిన అరుదైన చిత్రాల్లో ఇదొకటి. స్త్రీలు అనుభవజ్ఞులైన చిత్రకారులచే శిక్షణ పొందడం వారి చిత్రాలను ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ప్రదర్శనలైన సెలూన్‌లో ప్రదర్శించడం లాంటి విప్లవాత్మక సంఘటనలు సంభవించాయి. ఇది స్వేచ్ఛకు ఉపమానంగా ఉన్న స్త్రీ చిత్రం. అనగా స్వేచ్ఛ అనే భావనకు చిహ్నంగా స్త్రీని సూచించారు.*

### కృత్యం

చిత్రాలను జాగ్రత్తగా పరిశీలించండి. చిత్రంలో బాక్స్ 1 లో మీరు చూసిన రాజకీయ చిహ్నాలుగా ఉన్న వస్తువులను గుర్తించండి. (విచ్ఛిన్న గొలుసు, ఎర్ర టోపీ, కడ్డీల కట్ట, హక్కుల ప్రకటన చార్టర్) తరచుగా త్రిభుజ రూపంలోని పిరమిడ్ సమానత్వాన్ని సూచిస్తుంది. పెయింటింగ్‌ను విశదీకరించడానికి చిహ్నాలను ఉపయోగించండి. స్త్రీ స్వేచ్ఛ గురించి మీ అభిప్రాయాలను వివరించండి.

వేరుగా చూపుతుందని భావించారు. ఇది మోకాలి బ్రీచ్‌లు ధరించే వారి అధికారాన్ని అంతమొందించేందుకు ప్రకటించే మార్గం. ఈ జాకోబిన్‌లను సాన్స్-కులెట్స్ అని పిలుస్తారు. అనగా మోకాలి బ్రీచ్‌లు లేనివారు అని అర్థం. సాన్స్-కులెట్స్ పురుషుల స్వేచ్ఛను సూచించే ఎరుపు టోపిని స్వేచ్ఛకు చిహ్నంగా ధరించేవారు. అయితే మహిళలకు మాత్రము ఇది అనుమతించ బడలేదు.

ఆహార పదార్థాల కొరత, వాటి అధిక ధరలతో కోపోద్రిక్తులైన అధిక సంఖ్యాక పారిస్ ప్రజలతో 1792 వేసవిలో జాకోబిన్లు ఒక తిరుగుబాటుకి ప్రణాళిక వేశారు. ఆగస్టు 10 ఉదయం వారు ట్యూలరీస్ మహాల్ మీదకి దాడి చేసి రాజు కాపలాదారులను ఊచకోత కోశారు. రాజును చాలా గంటలు బందీగా ఉంచారు. తరువాత రాచరిక కుటుంబాన్ని చెరసాల పాలు చేయాలని శాసనసభ తీర్మానించింది. దాంతో ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి సంపదతో సంబంధం లేకుండా 21 సంవత్సరాలు దాటిన పురుషులందరికీ ఓటు హక్కు లభించింది.

కొత్తగా ఎన్నికైన శాసనసభను కన్వెన్షన్ అని పిలవసాగారు. 1792 సెప్టెంబర్ 21న అది రాచరికాన్ని రద్దుచేసి ఫ్రాన్స్‌ని గణతంత్రంగా ప్రకటించింది. గణతంత్రం అంటే ప్రభుత్వ అధినేతతో సహా ప్రభుత్వాన్ని ప్రజలే ఎన్నుకుంటారు అని మీకు తెలుసు.

AP SCERT

వంశపారంపర్య రాచరికం ఉండదు. గణతంత్ర దేశాలుగా ఉన్న ఇతర దేశాలను గుర్తించి అవి ఎప్పుడు ఎలా ఏర్పడ్డాయో పరిశోధించండి.

దేశద్రోహం ఆరోపణపై లూయి XVI కు న్యాయస్థానం మరణదండన విధించింది. జనవరి 21, 1793 న ప్లేస్ డి లా కాన్‌కార్డ్ వద్ద అతను బహిరంగంగా ఉరి తీయబడ్డారు. తరువాత అతి కొద్ది కాలంలోనే రాణి మేరీ ఆంటోనెట్ కూడా అటువంటి శిక్షనే అనుభవించింది.

**కొత్త పదాలు**

దేశద్రోహం – ఒకరు దేశానికి లేదా ప్రభుత్వానికి చేసే ద్రోహం

## 3.1 భీతావహ పాలన

1793–1794 మధ్య కాలాన్ని భీతావహ పాలనగా పేర్కొంటారు. తీవ్ర నియంత్రణ శిక్ష విధానాన్ని రాబిస్పియర్ అనుసరించాడు. రిపబ్లిక్‌కి శత్రువులుగా అతడు భావించిన వాళ్ళందరినీ–కులీనులు, మతాధికారులు, ఇతర రాజకీయ పార్టీల సభ్యులు అతని పద్ధతులతో ఏకీభవించని అతని పార్టీ సభ్యులను సైతం అరెస్టు చేసి జైలుకు పంపించి విప్లవ ట్రిబ్యునల్ ద్వారా విచారించేవాళ్లు. వాళ్ళను న్యాయస్థానం దోషులుగా నిర్ణయిస్తే గిల్లోటిన్ ద్వారా చంపేసేవాళ్ళు గెలిటిన్ అనేది రెండు స్తంభాలు, ఒక బ్లేడు కలిగిన తలలు నరికే యంత్రం. దీనిని కనిపెట్టిన డాక్టర్ **గిల్లోటిన్** పేరునే దీనికి పెట్టారు.

రాబిస్పియర్ ప్రభుత్వం వేతనాలు, ధరలపై గరిష్ట పరిమితిని విధించే చట్టాలను జారీ చేసింది. మాంసం, రొట్టెలకు రేషన్ విధించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పట్టణాలకు రవాణా చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మేలా నిర్బంధించేవారు. ఖరీదైన తెల్ల పిండిని ఉపయోగించడం నిషేధించింది. ప్రజలందరూ మొత్తం గోధుమ పిండితో చేసిన రొట్టెలను మాత్రమే తినాలి. ప్రసంగాలలోను, సంభోధనలలోను కూడా సమానత్వం పాటించాలని కోరింది. సంప్రదాయ మాన్సియర్ (సర్), మేడమ్‌లకు బదులుగా ఫ్రెంచి పురుషులను సిటోయెన్ అని, స్త్రీలను సిటోయెన్నీ (పౌరులు)గా పిలవాలి. చర్చిలను మూసివేసి వాటి భవనాలను సైన్యానికి ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చివేశారు.

రాబిస్పియర్ తన విధానాలను ఎంత కఠినంగా అమలు చేసేవాడు అంటే అతడి సహచరులే అతనిని కొంత సంయమనం పాటించాలని కోరసాగారు. చివరికి అతను 1794 జూలైలో న్యాయస్థానం ద్వారా దోషిగా తేల్చబడ్డాడు. వెంటనే అతడిని అరెస్టు చేసి ఆ మరునాడే గెలిటిన్ ద్వారా చంపేశారు.

**మూలం *D***

**స్వేచ్ఛ అంటే ఏమిటి? రెండు విరుద్ధ భావనలు:**

విప్లవాత్మక పాత్రికేయుడు కామిల్లె డెస్మాలిన్స్ 1793లో ఈ క్రింది వాటిని రాశాడు. అతను తరువాత భీతావహ పాలనలో ఉరి తీయబడ్డాడు.

'స్వేచ్ఛ అనేది ఒక పసిబిడ్డ లాంటిది. అది క్రమశిక్షణ అనే దశను దాటుకొని పరిపక్వత చెందాలి. స్వేచ్ఛ అంటే ఆనందం, ఆలోచన, సమానత్వం, న్యాయం. ఇది హక్కుల ప్రకటన.... నీవు నీ శత్రువుల శిరస్సు ఛేదించి అంతమొందించవచ్చు. దీనికి మించిన మూర్ఖపు ఆలోచన ఉంటుందా. ఒక వ్యక్తి తన బంధువులు, మిత్రుల నుండి కనీసం 10 మందిని శత్రువులుగా మార్చకుండా చూడడం నీకు సాధ్యమవుతుందా?



1794 ఫిబ్రవరి 7న రోబిస్పియర్ కన్వెన్షన్ లో ఒక ప్రసంగం చేశాడు. తరువాత ఇది 'లీమానిటర్ యూనివర్సెల్' అనే వార్తా పత్రికలో ప్రచురించబడింది. 'దాని అంశమే ఇక్కడుంది: 'ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి, పటిష్టపరచడానికి ముందుగా మనం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగే స్వతంత్ర పోరాటాన్ని ముగించాలి. దేశ విదేశాలలో గణతంత్ర రాజ్యానికి వ్యతిరేకంగా ఉన్న శత్రువులను అంతమొందించాలి. విప్లవ సమయాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వం భీతావహ విధానాలను అనుసరించవచ్చు. ఇది న్యాయసమ్మతం, ఇది వేగంగా తీవ్రంగా దృఢంగా ఉంటుంది. తన పితృదేశ అవసరాలను తీర్చడానికి ఉపయోగించవచ్చు. భీతవహ చర్యల ద్వారా స్వేచ్ఛ యొక్క శత్రువులను అంత మొందించడం గణతంత్ర రాజ్యస్థాపకుని హక్కు.'

### కృత్యం

డెస్మాలిన్స్, రాబిస్పియర్ యొక్క అభిప్రాయాలను సరిపోల్చండి. రాజ్యాధికారం ఉపయోగించడాన్ని ప్రతి ఒక్కరూ ఎలా అర్థం చేసుకోవాలి? రాబిస్పియర్ ఉద్దేశంలో దౌర్జన్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర యుద్ధం అంటే ఏమిటి? డెస్మాలిన్స్ స్వేచ్ఛను ఎలా అర్థం చేసుకున్నాడు. మూలం ***C*** ని మరోసారి పరిశీలించండి. రాజ్యాంగంలో ఏ చట్టాలు వ్యక్తుల హక్కులను పేర్కొన్నాయి. మీ అభిప్రాయాలను తరగతి గదిలో చర్చించండి.

AP SCERT



*పటం 11: విప్లవ ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా తన ప్రజల రాజభక్తిని సమీకరించాలనుకుంది - వాటిలో ఒకటి ఈ తరహా పండుగలు నిర్వహించడం. పురాతన గ్రీస్, రోమ్ నాగరికతలకు చెందిన ఉజ్జ్వలమైన చారిత్రక వైభవాన్ని తెలియజేప్పే చిహ్నాలను వాడడం. మధ్యలో ఎత్తైన వేదికపై తాత్కాలిక ప్రాతిపదికన సొగసైన స్తంభాలు కూడిన మండపం తయారుచేసేవారు. ప్రజాసమూహాల వారు పోషించే పాత్రలు, వస్త్రాలు, కార్యకలాపాల గురించి వర్ణించండి. ఈ విప్లవాత్మక చిత్రం అందించే సందేశం ఏమిటి?*

## 3.2 ఫ్రాన్స్‌లో డైరక్టరీ పరిపాలన

జాకోబిన్ ప్రభుత్వం పడిపోవడంతో సంపన్న మధ్యతరగతి వర్గం అధికారాన్ని చేజిక్కించుకుంది. సమాజంలో ఆస్తిలేని వర్గాలకు ఓటు హక్కు లేకుండా చేసిన కొత్త రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఎన్నికైన రెండు శాసన మండళ్ళకు అవకాశం కల్పించింది. ఇది ఐదుగురు సభ్యులతో కూడిన కార్యనిర్వాహక వర్గమైన డైరక్టరీని నియమిస్తుంది. జాకోబిన్ ప్రభుత్వంలో మాదిరి అధికారం ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృతం కాకుండా చూడటానికి ఈ విధానాన్ని చేపట్టారు. అయితే డైరెక్టరీ తరచుగా శాసనసభ సంఘాలతో ఘర్షణ పడుతూ ఉండేవాళ్లు, దాంతో వాళ్ళని తొలగించేవి. డైరెక్టరీ పాలన విధానంలోని రాజకీయ అస్థిరత్వం నెపోలియన్ బోనపార్టీ సైనిక నియంతగా ఎదగడానికి దోహదంచేసింది.

ప్రభుత్వ రూపంలో వచ్చిన ఈ మార్పులన్నింటి ద్వారా స్వేచ్ఛ యొక్క ఆదర్శాలు, చట్టం ముందు సమానత్వం, సౌభ్రాతృత్వం స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ఇవి తరువాత శతాబ్దంలో ఫ్రాన్స్‌తోపాటు మిగిలిన ఐరోపాలో రాజకీయ ఉద్యమాలను ప్రేరేపించాయి.

# 4 మహిళలు తిరుగుబాటు చేస్తారా?



*పటం 12: వెర్సయిల్స్‌కి వెళుతున్న ప్యారిస్ మహిళలు*

*ఈ చిత్రం 1789 అక్టోబర్ 5న మహిళలు వెర్సయిల్స్‌కి వెళ్లి తమతో రాజును తీసుకువచ్చిన సంఘటనను తెలియజేస్తున్న చిత్రాలలో ఒకటి*

AP SCERT

ఫ్రెంచ్ సమాజంలో ముఖ్యమైన మార్పులు తెచ్చిన అన్ని సంఘటనలలో మహిళలు మొదటి నుంచి క్రియాశీలకంగా పాల్గొన్నారు. వీటిల్లో తాము భాగస్వాములు కావటం ద్వారా తమ జీవితాలను మెరుగుపరిచే చర్యలు ప్రవేశపెట్టేలా విప్లవ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావచ్చని వాళ్ళు ఆశించారు. మూడవ ఎస్టేటులోని అధిక శాతం మహిళలు జీవనోపాధి కోసం శ్రమించాల్సి వచ్చేది. బట్టలు కుట్టడం, ఉతకడం వంటి పనులు చేసేవాళ్లు. బజారులో పూలు, పళ్ళు కూరగాయలు అమ్మేవారు. లేదా ధనికుల ఇళ్లల్లో పనులు చేసేవాళ్లు. అధిక శాతం మహిళలకు చదువు, ఉపాధికి శిక్షణ అందుబాటులో ఉండేవి కాదు. కులీన, మూడవ ఎస్టేటు సంపన్న వర్గాల కుమార్తెలు మాత్రమే కాన్వెంట్లో చదవగలిగే వారు. ఆ తరువాత వాళ్లకు పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసేవారు. శ్రామిక మహిళలు తమ కుటుంబాల బాధ్యత కూడా వహించాల్సి వచ్చేది. వంట చేయడం, నీరు తీసుకురావడం, రొట్టెల కోసం క్యూలో నిలబడటం, పిల్లల సంరక్షణ వంటి కుటుంబ బాధ్యతలు వహించేవారు. పురుషుల కంటే మహిళల వేతనాలు తక్కువగా ఉండేవి.

ఈ క్రమంలో వారి అభిరుచులను చర్చించుకోవడానికి, వ్యక్తపరచడానికి మహిళలు తమ సొంత రాజకీయ క్లబ్బులు, వార్తాపత్రికలు ప్రారంభించారు. ఫ్రాన్స్‌లోని వివిధ పట్టణాలలో 60 దాకా మహిళల క్లబ్బులు ఏర్పాటు అయ్యాయి. వాటిల్లో విప్లవ గణతంత్ర మహిళల సంఘం 'సొసైటీ ఆఫ్ రెవల్యూషనరీ అండ్ రిపబ్లికన్

### కృత్యం

చిత్రం:12లో ప్రాతినిథ్యం వహించిన వ్యక్తులను గూర్చి వివరించండి. వారి చర్యలు, భంగిమలు, వారు మోస్తున్న వస్తువులను జాగ్రత్తగా పరిశీలించి వీరంతా ఒకే సామాజిక వర్గం నుండి వచ్చారా అనేది గమనించండి. చిత్రంలో కళాకారుడు ఏ చిహ్నములను చేర్చాడు. ఇవి దేనిని సూచిస్తున్నాయి? మహిళలు చర్యలు స్త్రీలు బయట ఎలా ప్రవర్తించాలి అనే సంప్రదాయ ఆలోచనలను ప్రతిబింబిస్తున్నాయా? మీరు ఏమనుకుంటున్నారు? కళాకారుడు, మహిళల కార్యకలాపాల పట్ల సానుభూతి వ్యక్తపరుస్తున్నాడా? లేదా వారిని విమర్శిస్తున్నాడా? తరగతిలో మీ అభిప్రాయాలను చర్చించండి.

ఉమెన్' బాగా ప్రఖ్యాతి గాంచింది. పురుషులతో సమానమైన రాజకీయ హక్కులను స్త్రీలు అనుభవించాలనేది వాళ్ళ ప్రధాన కోరికలలో ఒకటి. 1791 రాజ్యాంగం వారిని నిష్క్రియ పౌరులుగా చేయటంతో మహిళలు నిరాశకు లోనయ్యారు. ఓటు హక్కు , శాసనసభకు పోటీ చేసే హక్కు, శాసనసభలో పదవి చేపట్టే హక్కు కావాలని వాళ్లు పోరాటాలు చేపట్టారు. అప్పుడే కొత్త ప్రభుత్వం తమ ప్రయోజనాలకు ప్రాతినిథ్యం వస్తుందని భావించారు.

ప్రారంభ సంవత్సరాల్లో విప్లవ ప్రభుత్వం మహిళల జీవితాలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడే చట్టాలను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, ఆడపిల్లలకు చదువు తప్పనిసరి చేశారు. తల్లిదండ్రులు వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసే హక్కును తీసేశారు. వివాహం అనేది స్వేచ్ఛగా చేసుకునే ఒప్పందం. దీనిని పౌరచట్టం కింద నమోదు చేసుకోవాలి. విడాకులను చట్టబద్ధం చేశారు. వాటి కోసం పురుషులు, స్త్రీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలు ఇప్పుడు ఉద్యోగాల కోసం శిక్షణ పొందవచ్చు, కళాకారులు కావచ్చు, చిన్న వ్యాపారాలు నడపవచ్చు.

సమాన రాజకీయ హక్కుల కోసం మహిళల ఉద్యమం కొనసాగింది. భీతావహ పాలనా కాలంలో మహిళల క్లబ్బులు మూసివేస్తూ, వాళ్ళ రాజకీయ కార్యకలాపాలు నిషేధిస్తూ, కొత్త ప్రభుత్వం చట్టాలు చేసింది. అనేకమంది ప్రముఖ మహిళలను చెరసాల పాలు చేశారు. మరణశిక్ష విధించారు.

ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో రెండు శతాబ్దాల పాటు మహిళలకు ఓటు హక్కు కోసం, సమాన వేతనాల కోసం పోరాటాలు కొనసాగాయి. 19వ శతాబ్దపు చివర, 20వ శతాబ్దం ఆరంభంలో ఓటు హక్కు కోసం అంతర్జాతీయ ఓటు హక్కు ఉద్యమం కొనసాగింది. విప్లవ కాలంలో ఫ్రెంచి మహిళల రాజకీయ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఈనాటికి నిలిచిపోయాయి. ఫ్రాన్స్ మహిళలకు అంతిమంగా 1946లో ఓటు హక్కు లభించింది.

AP SCERT

మూలం : ***E***

## ఒక విప్లవ మహిళ జీవితం – ఒలింపే డి గౌజెస్ (1749–1793)



ఫ్రాన్స్ విప్లవాత్మక రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించిన మహిళల్లో ముఖ్యమైన మహిళ ఒలింపేడి గౌజెస్. రాజ్యాంగంపై పురుషుల పౌరుల హక్కుల ప్రకటనపై ఆమె నిరసన వ్యక్తం చేసింది. ఎందుకంటే వారు ప్రతి మనిషికి హక్కుగా ఉన్న ప్రాథమిక హక్కుల నుండి మహిళలను మినహాయించారు. కాబట్టి 1791లో ఆమె స్త్రీల పౌర హక్కుల ప్రకటనను రచించింది. ఆమె దీనిని రాణికి, నేషనల్ అసెంబ్లీలోని సభ్యులకు తెలియజేసి వారు దానిపై చర్చ తీసుకోవాలని కోరింది. 1793లో ఒలింపేడి గౌజెస్, మహిళా క్లబ్బులను బలవంతంగా మూసివేస్తున్నారని జాకోబిన్ ప్రభుత్వాన్ని విమర్శించింది. ఆమెపై నేషనల్ కన్వెన్షన్ దేశద్రోహ నేరం మోపి విచారించింది. తరువాత ఆమెను ఉరి తీసారు.

మూలం *F*

**ఒలింపే డి గౌజెస్ తన డిక్లరేషన్ లో పేర్కొన్న కొన్ని ప్రాథమిక హక్కులు**

1. స్త్రీ స్వేచ్ఛగా జన్మించింది. పురుషులతో సమానమైన హక్కులు ఉంటాయి.
2. స్త్రీ, పురుషుల సహజ హక్కుల పరిరక్షణ అన్ని రాజకీయ సంఘాల లక్ష్యం. అవి : స్వేచ్ఛ, ఆస్తి, భద్రత ఈ హక్కులు మరియు అన్నిటికంటే ముఖ్యమైన అణిచివేతను ప్రతిఘటించే హక్కు.
3. స్త్రీ పురుషుల సమైక్యతతో ఏర్పడిన దేశానికే సార్వభౌమాధికారం ఉంటుంది.
4. సాధారణ ప్రజల అభిప్రాయ వ్యక్తీకరణే చట్టం. స్త్రీ, పురుష పౌరులందరూ దాని రూపకల్పనలో వ్యక్తిగతంగా లేదా వారి ప్రతినిధుల ద్వారా వారి అభిప్రాయాన్ని వ్యక్తీకరించాలి. ఇది అందరికీ సమానంగా ఉండాలి. స్త్రీ పురుష పౌరులందరూ వారి వారి సామర్థ్యాలు, ప్రతిభానుసారంగా గౌరవం, ప్రభుత్వ ఉద్యోగాలు పొందుటకు అర్హులు. ఎంపికలో వారి ప్రతిభను తప్ప మరి దేనిని పరిగణించరాదు.
5. చట్టం విషయంలో ఏ స్త్రీ మినహాయింపు కాదు. పురుషులు మాదిరిగానే స్త్రీలు కూడా చట్టం ద్వారా నేరం మోపబడి, కేసులలో అరెస్టులు మరియు నిర్బంధాలు చేయబడతారు. స్త్రీలు కూడా ఈ కఠిన చట్టాలను ఆమోదిస్తారు.



*పటం 13 దుకాణాల వద్ద బారులు తీరిన మహిళలు*

**కృత్యం**

పటం 13 లోని మహిళల్లో ఒకరిగా మిమ్మల్ని మీరు ఊహించుకోండి. చౌమెట్ ప్రతిపాదించిన వాదనలకు ప్రతిస్పందనను రూపొందించండి.

**కృత్యం**

మానవ మరియు పౌర హక్కుల ప్రకటన(మూలం C)తో ఒలింప్ డి గౌజెస్ రూపొందించిన మేనిఫెస్టోను (మూలం F) సరిపోల్చండి.

మూలం *G*

1793లో జాకోబిన్ రాజకీయ నాయకురాలు చౌమెట్ ఈ క్రింది కారణాలపై మహిళల క్లబ్బుల మూసివేతను సమర్థించడానికి ప్రయత్నించింది.

'ప్రకృతి పురుషులకు గృహ విధులను అప్పగించిందా? ఆమె మనలను పాలిచ్చి పెంచమందా?'

లేదు.

**ఆమె పురుషునితో ఇలా చెప్పింది :**

పురుషుడిగా ఉండు. వేట, వ్యవసాయం, రాజకీయము నీ విధులు. అదే నీ రాజ్యం.

**ఆమె స్త్రీతో ఇలా చెప్పింది :**

మహిళగా ఉండు. ఇంటి పనులు, మాతృత్వం యొక్క మధురమైన విధులు. అవే నీ బాధ్యతలు. మగరాయుళ్ళుగా వ్యవహరించాలనే ఈ స్త్రీలు సిగ్గుపడాలి. వారి వారి విధులు సక్రమంగా విభజించబడి ఉండలేదా?

APSCERT

# 5 బానిసత్వం నిర్మూలన

ఫ్రెంచ్ కాలనీలలో బానిసత్వాన్ని నిర్మూలించడం జాకోబిన్ పాలన యొక్క అత్యంత విప్లవాత్మక సామాజిక సంస్కరణలో ఒకటి. కరేబియన్‌లో గల మార్టినిక్ గ్వాడెలోప్, శాన్‌డోమింగోలోని కాలనీలు పొగాకు, నీలిమందు, చక్కెర, కాఫీ వంటి వస్తువుల యొక్క ముఖ్యమైన సరఫరాదారులు. యూరోపియన్లు తెలియని సుదూర ప్రాంతాలకు వెళ్లి పనిచేయడానికి ఇష్టపడకపోవడం వల్ల తోటలలో కూలీల కొరత ఏర్పడింది. దీంతో ఐరోపా, ఆఫ్రికా, అమెరికాల మధ్య త్రైపాక్షికంగా బానిస వ్యాపారం మొదలైంది. 17వ శతాబ్దంలో బానిస వ్యాపారం ప్రారంభమైనది. ఫ్రెంచ్ వ్యాపారులు బోర్డియక్స్ లేదా నాంటెస్ ఓడరేవుల నుండి ఆఫ్రికన్ తీరానికి ప్రయాణించి అక్కడ వారు స్థానిక నాయకుల నుండి బానిసలను కొనుగోలు చేసేవారు. బానిసలుగా ముద్రలు వేయబడి, సంకెళ్ళు వేయబడి, నిర్బంధించబడిన బానిసలు మూడు నెలలు ప్రయాణించి అట్లాంటిక్ నుండి కరేబియన్‌కు చేరుకునేవారు. వారిని తోటల యజమానులకు అమ్మేసేవారు. చక్కెర, కాఫీ, నీలిమందులకు యూరోపియన్ మార్కెట్లలో పెరుగుతున్న డిమాండ్‌ను పూరించడం బానిస వ్యాపారం వలన సాధ్యమయింది. బోర్డియక్స్, నాంటెస్ వంటి ఓడరేవు నగరాలు తమ ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కారణమైన బానిస వ్యాపారానికి రుణపడి ఉంటాయి.

18వ శతాబ్దమంతా ఫ్రాన్స్‌లోని బానిసత్వం పై విమర్శలు లేవు. మానవ హక్కులను ఫ్రెంచ్ కాలనీలలో అన్ని వర్గాల ప్రజలతో సహా ఫ్రెంచి పౌరులందరికీ విస్తరింపచేయాలా లేదా అనే దానిపై జాతీయ శాసనసభ సుదీర్ఘ చర్చలు నిర్వహించింది. కానీ బానిస వ్యాపారంపై ఆధారపడి ఆదాయాలు పొందుతున్న వ్యాపారవేత్తల నుండి వ్యతిరేకతకు భయపడి ఎటువంటి చట్టాలను ఆమోదించలేదు. చివరకు కన్వెన్షన్ ఫ్రెంచ్ వారి ఆధీనంలో ఉన్న విదేశీ బానిసలు అందరినీ విడిపించేందుకు 1794లో చట్టం చేసింది. అయితే ఇది స్వల్పకాలానికే పరిమితమైనది. 10 సంవత్సరాల తరువాత నెపోలియన్ బానిసత్వాన్ని తిరిగి ప్రవేశపెట్టాడు. తోటల యజమానులు వారి ఆర్థిక ప్రయోజనాల కోసం ఆఫ్రికన్ నీగ్రోలను బానిసలుగా నియమించుకోవడం తమ హక్కుగా భావించారు. చివరకు 1848లో ఫ్రెంచ్ కాలనీలలో బానిసత్వం రద్దు చేయబడింది.




**పటం 14 : బానిసల విముక్తి**
*1794 నాటి ఈ ముద్రణ బానిసల విముక్తిని వివరిస్తుంది. పైన ఉన్న త్రివర్ణ పతాకం పై 'మానవ హక్కులు' అనే నినాదం ఉంది. కింద ఉన్న శాసనం ఇలా ఉంది. 'స్వేచ్ఛ లేని వారికి స్వేచ్ఛ' ఒక ఫ్రెంచ్ మహిళ ఆఫ్రికన్, రెడ్ ఇండియన్ బానిసలకు యూరోపియన్ దుస్తులు ధరింపజేసి వారిని నాగరికులుగా తయారుచేయడానికి ప్రయత్నించేది.*

కొత్త పదాలు

నీగ్రోలు : ఆఫ్రికాలోని సహారాకు దక్షిణాన ఉన్న స్థానిక ప్రజల కోసం ఉపయోగించే పదం. ఇది సాధారణంగా వాడుకలో లేని అవమానకరమైన పదం.

విముక్తి : స్వేచ్ఛను కల్పించే చర్య

## కృత్యం

చిత్రం :-14 పై మీ అభిప్రాయాలను తెలపండి. నేలపై పడి ఉన్న వస్తువులను వివరించండి. అవి దేనికి ప్రతీక? యూరోపియన్ బానిసలు కాని వారి పట్ల ఈ చిత్రం ఎటువంటి వైఖరిని వ్యక్తపరుస్తుంది.

AP SCERT

# 6 విప్లవం మరియు రోజువారి జీవితం

ప్రజలు ధరించే దుస్తులను, వారు మాట్లాడే భాష లేదా వారు చదివే పుస్తకాలను రాజకీయలు మార్చగలవా? 1789 తరువాత స్త్రీ, పురుషులు, పిల్లల జీవితాల్లో ఇటువంటి అనేక మార్పులు ఫ్రాన్స్‌లో వచ్చాయి. స్వేచ్ఛ, సమానత్వం వంటి ఆదర్శాలను నిత్యజీవితంలో ఆచరణలోకి తీసుకువచ్చేలా చట్టాలను ఆమోదించడం తమ బాధ్యతగా విప్లవ ప్రభుత్వాలు భావించాయి.

1789 వేసవిలో బాస్టిల్ పై దాడి జరిగిన వెంటనే సెన్సార్‌షిప్ (పూర్వ పరిశీలతత్వం) రద్దు చేయుట అమలులోకి వచ్చిన ఒక ముఖ్యమైన చట్టం. పాత పరిపాలన విధానంలో అన్ని వ్రాతపూర్వక అంశాలు, సాంస్కృతిక కార్యకలాపాలు, పుస్తకాలు, వార్తాపత్రికలు, నాటకాల వంటివి రాజుచే ఆమోదించబడిన తర్వాత మాత్రమే ప్రచురించబడేవి లేదా ప్రదర్శించబడేవి. ఇప్పుడు మానవ, పౌర హక్కుల ప్రకటన వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛను సహజ హక్కుగా ప్రకటించింది. వార్తాపత్రికలు, కరపత్రాలు పుస్తకాలు, ముద్రిత చిత్రాలు ఫ్రాన్స్ పట్టణాలలో కుప్పలు తెప్పలుగా చేరాయి. అక్కడ నుండి శరవేగంగా గ్రామీణ ప్రాంతాలకు త్వరితగతిన విస్తరించాయి. అవి ఫ్రాన్స్‌లో జరుగుతున్న సంఘటనలు, మార్పులను గురించి వివరించేవి, చర్చించేవి. పత్రికా స్వేచ్ఛ అనగా జరుగుతున్న సంఘటనలపై వ్యతిరేక అభిప్రాయాలను కూడా వ్యక్తపరిచే స్వేచ్ఛ ఇవ్వబడింది. ప్రతిపక్షాలు ముద్రణ మాధ్యమం ద్వారా ప్రజలలో తమ స్థానాన్ని పదిల పరుచుకునేందుకు ప్రయత్నించాయి. నాటికలు, పాటలు, పండుగ ఊరేగింపులు పెద్ద సంఖ్యలో ప్రజలను ఆకర్షించాయి. విద్యావంతులైన తక్కువ మంది ప్రజలు మాత్రమే చదవగలిగే రాజకీయ తత్వవేత్తల గ్రంథాలను, సుదీర్ఘంగా వ్రాసిన స్వేచ్ఛ లేదా న్యాయం వంటి ఆలోచనలను సామాన్య ప్రజానీకం గ్రహించడానికి, గుర్తించడానికి ఇవి ప్రధాన మార్గాలు అయ్యాయి.

**కృత్యం:**

పై చిత్రాన్ని మీ సొంతమాటల్లో వివరించండి. దురాశ, సమానత్వం, న్యాయం, చర్చి యొక్క ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం వంటి ఆలోచనలు వ్యక్తపరచాడానికి కళాకారుడు ఉపయోగించిన చిత్రాలు ఏమిటి?



*పటం 15: దేశభక్తి కొవ్వును తగ్గించే ప్రెస్*
*న్యాయభావనను స్పష్టీకరించడానికి 1790లోని అజ్ఞాత ముద్రణ.*

AP SCERT



*పటం 16: మరాట్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం. ఇది లూయిస్ లియోపోల్డ్ బాయిలీ గీసిన చిత్రం.*
*ఈ అధ్యాయంలో మారా గురించి మీరు నేర్చుకున్న వాటిని గుర్తు చేసుకోండి. అతని చుట్టూ ఉన్న దృశ్యాన్ని వివరించండి. సెలూన్ లోని వీక్షకులలో ఇలాంటి చిత్రం ఎలాంటి ప్రతిస్పందనలను కలిగిస్తుంది.*

## ముగింపు

1804లో నెపోలియన్ బోనాపార్టీ తనను తాను ఫ్రాన్స్ చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. అతను పొరుగున ఉన్న అనేక యూరోపియన్ దేశాలను జయించడానికి బయలుదేరాడు. అనేక రాజవంశాలను తొలగించి స్వాధీనపరుచుకున్న రాజ్యాలను తన కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉంచాడు. నెపోలియన్ యూరప్‌ను ఆధునికీకరించాడు. ప్రైవేటు ఆస్తి రక్షణ, దశాంశ పద్ధతితో కూడిన తూనికలు, కొలతల యొక్క ఏకరీతి విధానం వంటి అనేక చట్టాలను ప్రవేశపెట్టాడు. ప్రారంభంలో చాలామంది నెపోలియన్‌ని ప్రజలకు స్వేచ్ఛను తెచ్చే విమోచకునిగా భావించారు. కానీ నెపోలియన్ సైన్యాలు ప్రతి చోట ఒక దండయాత్ర శక్తిగా చూడబడ్డాయి. చివరకు అతను 1815లో వాటర్లు యుద్ధంలో ఓడిపోయాడు. నెపోలియన్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక భావాలు అయిన స్వేచ్ఛ, ఆధునిక చట్టాలు నెపోలియన్ తర్వాత చాలా కాలం పాటు యూరప్‌లోని ఇతర ప్రాంతాల ప్రజలపై ప్రభావం చూపాయి.

స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులు ఫ్రెంచ్ విప్లవం ద్వారా సంక్రమించాయి. ఇవి 19వ శతాబ్దంలో యూరప్ అంతట వ్యాపించాయి. భూస్వామ్య వ్యవస్థలు రద్దు



**చిత్రం 17: ఆల్ప్స్ పర్వతాలను దాటుతున్న నెపోలియన్, డేవిడ్‌చే చిత్రీకరించబడింది.**

చేయబడ్డాయి. వలసరాజ్యాల ప్రజలు తమ ఉద్యమాల ద్వారా బానిసత్వం నుండి స్వేచ్ఛ అను భావాలను పునఃనిర్మించి ఒక సార్వభౌమ దేశాన్ని సృష్టించారు. టిప్పుసుల్తాన్, రాజా రామ్మోహన్ రాయులను ఫ్రెంచి విప్లవ భావాలకు ప్రతిస్పందించిన వ్యక్తులుగా చెప్పవచ్చు.

**బాక్స్ 2**

ఫ్రెంచ్ విప్లవ కాలంలో ఐరోపాలో వ్యాపించిన కొత్త ఆలోచనల నుండి ప్రేరణ పొందిన వారిలో రాజా రామ్మోహన్ రాయ్ ఒకరు. ఫ్రెంచ్ విప్లవం అనంతరం జరిగిన జూలై విప్లవం అతని ఆలోచనలను ఉత్తేజపరిచింది.

'1830 ఫ్రాన్స్‌లో జూలై విప్లవం గురించి విన్నప్పుడు అతను ఏమీ ఆలోచించ లేకపోయాడు. మాట్లాడలేక పోయాడు. ఇంగ్లాండ్‌కి వెళుతున్నప్పుడు ప్రమాదానికి గురైనప్పటికీ కేప్‌టౌన్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి యుద్ధ నౌకలను సందర్శించాలని పట్టుబట్టాడు.'

*సుశోభన్ సర్కారు 1946 బెంగాల్ పునర్జీవనంపై నమోదు.*

## కృత్యాలు

1. ఈ అధ్యాయంలో మీరు చదివిన విప్లవాత్మక వ్యక్తులలో ఒకరి గురించి విపులంగా తెలుసుకోండి. ఆ వ్యక్తి యొక్క జీవిత చరిత్రను వ్రాయండి.
2. ఫ్రెంచ్ విప్లవంలోని ప్రతిరోజు, వారంలో జరిగే సంఘటనలను వివరించే వార్తాపత్రికలు పెరిగాయి. ఏదైనా ఒక సంఘటనపై సమాచారం, చిత్రాలను సేకరించి వార్తాపత్రిక కథనాన్ని వ్రాయండి. మీరు మీరాబ్యూ, ఒలంపే డి గౌజెన్, రాబిస్పియర్ వంటి ముఖ్యమైన వ్యక్తులతో ఊహాత్మక ఇంటర్వ్యూ కూడా నిర్వహించవచ్చు. రెండు, మూడు సమూహాలలో పని చేయండి. ప్రతి సమూహం ఫ్రెంచ్ విప్లవం పై వాల్‌పేపర్ ను రూపొందించడానికి వారి కథనాలను బోర్డుపై ఉంచవచ్చు.

కృత్యాలు

## ప్రశ్నలు

1. ఫ్రాన్స్‌లో విప్లవాత్మక నిరసనలు చెలరేగడానికి దారి తీసిన పరిస్థితులను వివరించండి.
2. ఫ్రెంచ్ సమాజంలోని ఏ సమూహాలు విప్లవం నుండి ప్రయోజనం పొందాయి? ఏ సమూహాలు అధికారాన్ని వదులుకోవలసి వచ్చింది? విప్లవం యొక్క ఫలితాలతో సమాజంలోని ఏ వర్గాలు నిరాశ చెందాయి?
3. 19వ శతాబ్దం, 20వ శతాబ్దపు ప్రపంచ ప్రజలకు ఫ్రెంచి విప్లవం అందించిన ప్రాముఖ్యతను వివరించింది.
4. ఫ్రెంచి విప్లవ మూలాల నుండి గ్రహించిన, ఈరోజు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్య హక్కుల జాబితాను రూపొందించండి.
5. సార్వత్రిక హక్కుల సందేశం వైరుధ్యాలతో చుట్టుముట్టిందనే అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? వివరించండి.
6. నెపోలియన్ ఆవిర్భావాన్ని మీరు ఎలా వివరిస్తారు.
7. ప్రస్తుత కాలంలో రోజువారీ కూలీలుగా పనిచేసే అనేక తక్కువ ఆదాయ కుటుంబాలకు తమ సొంత భూమి ఉండదు మరియు వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడతారు. పాత ఫ్రెంచ్ సమాజంలో వీరికి అత్యంత సమానమైన వర్గం ఏది?

   (ఎ) మొదటి వర్గంలోని మతాధిపతులు
   (బి) రెండో వర్గంలోని కులీనులు
   (సి) మూడో వర్గంలోని ధనికులు
   (డి) మూడో వర్గంలోని పేద కార్మికులు

AP SCERT

ఆధ్యాయం - 2

# ఐరోపాలో సామ్యవాదం, రష్యా విప్లవం

U2L3U5

## 1 సామాజిక మార్పుల యుగం

ఫ్రెంచి విప్లవం తర్వాత యూరప్‌లో వ్యాప్తిచెందిన స్వేచ్ఛ, సమానత్వం వంటి శక్తివంతమైన భావనల గురించి మునుపటి అధ్యాయంలో మీరు చదివారు. సమాజం నిర్మితమయ్యే విధానంలో అద్భుతమైన మార్పును సృష్టించే అవకాశానికి ఫ్రెంచ్ విప్లవం శ్రీకారం చుట్టింది. పద్దెనిమిదవ శతాబ్దానికి ముందు సమాజం ఎస్టేట్‌లు, ఆర్డర్‌లుగా విభజింపబడి కులీనులు, చర్చ్‌లే ఆర్థిక, సామాజిక శక్తిని నియంత్రించేవని మీరు చదివారు. విప్లవం తరువాత ఒక్కసారిగా దీన్ని మార్చడం సాధ్యమే అనిపించింది. యూరప్, ఆసియాతో సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో, వ్యక్తిగత హక్కుల గురించి, సామాజిక శక్తిని నియంత్రించగల వారి గురించిన కొత్త భావనలపై చర్చలు జరిగాయి. భారతదేశంలో, రాజారామ్మోహన్ రాయ్, డెరోజియో ఫ్రెంచ్ విప్లవం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఇంకా అనేక మంది విప్లవానంతర యూరప్ భావనలు గురించి చర్చించారు. వలస ప్రాంతాల్లో జరిగిన పరిణామాలు ఈ సమాజ మార్పుకు చెందిన భావనలను పునర్నిర్మించాయి.

అయితే, యూరప్‌లోని అందరూ సమాజం పూర్తిగా పరివర్తనం చెందాలని కోరుకోలేదు. కొంత మార్పు అవసరమని భావించారు. అయితే అది క్రమంగా జరగాలని ఆశించే వారి నుండి, సమాజాన్ని పూర్తిగా పునర్నిర్మించాలనుకునే వారి వరకు ఆలోచనలు మారుతూ వచ్చాయి. వీరిలో కొందరు 'సంప్రదాయవాదులు', ఇతరులు 'ఉదారవాదులు' లేదా 'రాడికల్స్'గా ఉన్నారు. ఈ సందర్భంలో వాస్తవంగా ఈ పదాల అర్థం ఏమిటి? ఏ రాజకీయ అడ్డంకులు వీటిని వేరుపరిచాయి? వీటిని కలిపి ఉంచిన అంశాలు ఏమిటి? అన్ని సందర్భాలలో లేదా అన్ని వేళల్లో ఈ పదాలకు ఇదే అర్థం వర్తించదనే విషయం మనం గుర్తుంచుకోవాలి.

మనం పంతొమ్మిదవ శతాబ్దపు కొన్ని ముఖ్యమైన రాజకీయ సంప్రదాయాలను క్లుప్తంగా పరిశీలించి అవి మార్పును ఎలా ప్రభావితం చేసాయో గమనిద్దాం. సమాజాన్ని సమూలంగా మార్చే ప్రయత్నం జరిగిన ఒక చారిత్రక సంఘటనపై మనం దృష్టిసారిద్దాం. 20వ శతాబ్దంలో రష్యాలో సామ్యవాద భావనలతో జరిగిన విప్లవం సమాజంలో అత్యంత శక్తివంతమైన, ప్రముఖమైన మార్పుకు దోహదపడింది.

### 1.1 ఉదారవాదులు, రాడికల్స్, సంప్రదాయవాదులు

సమాజాన్ని మార్చాలని ప్రయత్నించిన సమూహాలలో ఉదారవాదుల సమూహం ఒకటి. అన్ని మతాలపట్ల సహనం పాటించే దేశం కావాలని ఉదారవాదులు కోరుకున్నారు. అయితే ఈ సమయంలో యూరోపియన్ రాజ్యాలు సాధారణంగా

AP SCERT

ఒక మతం పట్ల అనుకూలంగా ఉండి ఇతర మతాలను వేరుగా చూసేవారిని మనం గుర్తుంచుకోవాలి. (బ్రిటన్ చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు, ఆస్ట్రియా, స్పెయిన్ కాథలిక్ చర్చ్‌కు అనుకూలంగా ఉండేవి). ఉదారవాదులు కూడా రాజవంశ పాలకుల అనియంత్రిత అధికారాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యక్తుల హక్కులను కాపాడాలని వారు కోరుకున్నారు. వారు ప్రాతినిధ్య పూర్వక ఎన్నికైన పార్లమెంటరీ ప్రభుత్వం కావాలని కోరారు. ఈ పార్లమెంటు చేసిన చట్టాలను వ్యాఖ్యానించగల సుశిక్షిత న్యాయవ్యవస్థ ఉండాలని ఇది పాలకులకు, అధికారులకు లోబడని స్వంతంత్ర వ్యవస్థ అయి ఉండాలని వాదించారు. అయితే, వారు 'ప్రజాస్వామ్యవాదులు' కారు. ప్రతీ పౌరునికి ఓటు హక్కు ఉండాలనే సార్వత్రిక వయోజన ఓటు హక్కు భావనపై వారికి విశ్వాసం లేదు. సంపన్నులైన పురుషులకు మాత్రమే ఓటుహక్కు ఉండాలని భావించారు. మహిళలకు ఓటుహక్కు ఉండాలని వారు భావించలేదు.

దీనికి విరుద్ధంగా, అత్యధిక ప్రజలు కోరుకునే ప్రభుత్వం ఉన్న దేశం కావాలని రాడికల్స్ కోరుకున్నారు. అనేక మంది మహిళా ఓటు హక్కు ఉద్యమాలకు మద్దతు పలికారు. ఉదారవాదుల వలె కాకుండా, వారు గొప్ప భూస్వాములు, సంపన్న ఫ్యాక్టరీ యజమానుల అధికారాలను వ్యతిరేకించారు. వారు ప్రైవేట్ ఆస్తులు కలిగి ఉండడానికి వ్యతిరేకం కాదు. కాని కొద్దిమంది చేతుల్లో ఆస్తి కేంద్రీకరణను ఇష్టపడలేదు.

సంప్రదాయవాదులు, రాడికల్స్, ఉదారవాదులను వ్యతిరేకించారు. అయితే, ఫ్రెంచ్ విప్లవం తరువాత, సంప్రదాయవాదులు కూడా మార్పు యొక్క అవసరాన్ని అర్థం చేసుకున్నారు. మొదటగా పద్దెనిమిదవ శతాబ్దంలో, సంప్రదాయవాదులు సాధారణంగా మార్పు అనే ఆలోచనను వ్యతిరేకించారు. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి, కొంత మార్పు అనివార్యమని వారు అంగీకరించారు. అయితే గతాన్ని గౌరవించాలని, మార్పు ప్రక్రియను నెమ్మదిగా తీసుకురావాలని విశ్వసించారు.

ఫ్రెంచ్ విప్లవం తరువాత ఏర్పడిన సాంఘిక, రాజకీయ అలజడులలో సామాజిక మార్పుకు గురించిన ఆలోచనలు సంఘర్షణకు గురయ్యాయి. పంతొమ్మిదవ శతాబ్దంలో విప్లవం, జాతీయ పరివర్తన కోసం చేసిన వివిధ ప్రయత్నాలు ఈ రాజకీయ ధోరణుల పరిమితులు, సామర్థ్యాలను రెండింటినీ నిర్వచించడంలో సహాయపడ్డాయి.

## 1.2 పారిశ్రామిక వర్గం, సామాజిక మార్పు

ఈ రాజకీయ ధోరణులు మారిన కాలానికి సంకేతాలుగా నిలిచాయి. ఇది తీవ్రమైన సామాజిక, ఆర్థిక మార్పులకు లోనైన కాలం. ఈ కాలంలో కొత్త నగరాలు ఏర్పడి, కొత్త పారిశ్రామిక ప్రాంతాలు అభివృద్ధి చెంది, రైల్వేలు విస్తరించాయి, పారిశ్రామిక విప్లవం జరిగింది.

పారిశ్రామికీకరణ పురుషులు, మహిళలు, పిల్లలను కర్మాగారాలకు తీసుకువచ్చింది. తరచుగా పని గంటలు ఎక్కువగా ఉండి, వేతనాలు తక్కువగా ఉండేవి. ముఖ్యంగా పారిశ్రామిక వస్తువులకు డిమాండ్ తక్కువ ఉన్న కాలంలో నిరుద్యోగం సాధారణ విషయమైంది. పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నందున గృహనిర్మాణం, పారిశుధ్యం సమస్యలుగా మారాయి. ఉదారవాదులు, రాడికల్స్ ఈ సమస్యల పరిష్కారాల కోసం శోధించారు.

**కొత్త పదాలు**

ఓటు హక్కు ఉద్యమం – మహిళలకు ఓటు హక్కు కల్పించే ఉద్యమం

AP SCERT



*చిత్రం.1 – పంతొమ్మిదవ శతాబ్దపు మధ్యకాలంలో సమకాలీనులు చూసిన లండన్ పేదలు.*
ఆధారం : హెన్రీ మేహ్యూ, లండన్ లేబర్ మరియు లండన్ పూర్, 1861.

దాదాపు అన్ని పరిశ్రమలు వ్యక్తిగత ఆస్తులుగా ఉండేవి. ఉదారవాదులు, రాడికల్స్ తరచుగా ఆస్తి యజమానులుగానూ, ఉద్యోగాలు ఇచ్చేవారుగా ఉన్నారు. వాణిజ్యం లేదా పారిశ్రామిక సంస్థల ద్వారా సంపదను సమీకరించే ప్రయత్నాలను ప్రోత్సహించాలని వారు భావించారు – ఆర్థిక వ్యవస్థలో శ్రామిక శక్తి ఆరోగ్యంగా ఉండి పౌరులు విద్యావంతులైతే దాని ప్రయోజనాలు సాధించబడతాయి. పుట్టుకతో ఉన్నత వర్గాలకు సంక్రమించిన వారసత్వపు అధికారాలను వ్యతిరేకించి వారు స్వయంకృషి, శ్రమ, సంస్థ నిర్వహణను బలంగా విశ్వసించారు. వ్యక్తుల స్వేచ్ఛకు హామీ ఇచ్చి, పేదలు శ్రమించగలిగితే, సంపన్నులు ఆంక్షలు లేకుండా సంస్థను నిర్వహించగలిగితే సమాజాలు అభివృద్ధి చెందుతాయని వారునమ్మారు. పంతొమ్మిదవ శతాబ్దం ప్రారంభంలో ప్రపంచంలో మార్పులను కోరుకునే అనేక మంది శ్రామిక స్త్రీ, పురుషులు, ఉదారవాద, రాడికల్ సమూహాలు, పార్టీలకు మద్దతు పలికారు.

కొంతమంది జాతీయవాదులు, ఉదారవాదులు, రాడికల్స్ ఐరోపాలోని ప్రభుత్వాలను తొలగించడానికి 1815 వంటి విప్లవాలు రావాలని అని కోరుకున్నారు. ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, రష్యాలలో వారు విప్లవకారులుగా మారి, అప్పటికే ఉన్న చక్రవర్తులను పదవీచ్యుతులను చేయడానికి కృషి చేశారు. పౌరులందరికీ సమాన హక్కులు కల్పించగల 'జాతులను' ఏర్పాటుచేయగల విప్లవాల గురించి జాతీయవాదులు మాట్లాడారు.

AP SCERT

1815 తర్వాత, ఇటలీ జాతీయవాది అయిన గిసెప్పీ మాజ్జినీ, ఇటలీలో దీని సాధనకోసం ఇతరులతో కలిసి రహస్య ప్రణాళికలు రూపొందించాడు. భారతదేశంతో సహా – ఇతర చోట్ల జాతీయవాదులు అతని రచనలను చదివారు.

### 1.3 ఐరోపాకు సామ్యవాదం రాక

సమాజనిర్మాణం ఎలా జరగాలనే అత్యంత దూరదృష్టి గల దృక్కోణాలలో ఒకటి సామ్యవాదం. పంతొమ్మిదవ శతాబ్దం మధ్య నాటికి ఐరోపాలో సామ్యవాదం విస్తృత దృష్టిని ఆకర్షించిన ఒక ప్రసిద్ధ భావజాలంగా ఉండేది.

సామ్యవాదులు వ్యక్తిగత ఆస్తికి వ్యతిరేకం. ఆ కాలంలోని అన్ని సామాజిక రుగ్మతలకు వ్యక్తిగత ఆస్తే మూలంగా భావించారు. ఎందుకు? సొంత ఆస్తి ఉన్న వ్యక్తులు ఉపాధిని కల్పించారు. ధనికులు వ్యక్తిగత లాభం గురించి మాత్రమే శ్రద్ధ వహించి, ఆ ఆస్తి ఉత్పాదకతను కల్పించిన వారి సంక్షేమం గురించి ఆలోచించలేదు. కాబట్టి ఒక వ్యక్తి కాకుండ సమాజం మొత్తంగా ఆస్తిని నియంత్రిస్తే, సామూహిక సామాజిక ప్రయోజనాలపై ఎక్కువ శ్రద్ధను చూపవచ్చును. సామ్యవాదులు ఇటువంటి మార్పును కోరుకుని దాని కోసం ప్రచారం చేశారు.

ఆస్తి లేని సమాజం ఎలా నిర్వహించబడుతుంది? సామ్యవాద సమాజానికి ఆధారం ఏమిటి?

భవిష్యత్తు గురించి సామ్యవాదులకు భిన్నమైన దృక్పథాలు ఉన్నాయి. కొందరు సహకార భావనను విశ్వసించారు. **రాబర్ట్ ఓవెన్** (1771–1858), ప్రముఖ ఆంగ్ల ఉత్పత్తిదారులు, ఇండియానా (USA)లో న్యూ హార్మొనీ అనే సహకార సంఘాన్ని నిర్మించాలని కోరాడు. కేవలం వ్యక్తిగత చొరవ ద్వారా సహకార సంఘాలను విస్తృతస్థాయిలో నిర్మించలేరని ఇతర సామ్యవాదులు భావించారు: ప్రభుత్వాలు సహకార సంఘాలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఉదాహరణకు, ఫ్రాన్స్‌లో, **లూయిస్ బ్లాంక్** (1813–1882) పెట్టుబడిదారీ వ్యాపారాలకు బదులుగా ప్రభుత్వం సహకార సంఘాలను ప్రోత్సహించాలని భావించారు. వ్యక్తులు సంఘాలుగా ఏర్పడి సహకార సంఘాలలో వస్తూత్పత్తి చేసి గడించిన లాభాలను వారు చేసిన పనిని బట్టి పంచుకోవాలి.

**కార్ల్ మార్క్స్** (1818–1883), **ఫ్రెడరిక్ ఎంగెల్స్** (1820–1895) ఈ వాదనలకు ఇతర భావనలను జోడించారు. పారిశ్రామిక సమాజం 'పెట్టుబడిదారీ' వ్యవస్థ అని మార్క్స్ వాదించారు. పెట్టుబడిదారులు కర్మాగారాలలో పెట్టుబడి పెట్టే మూలధనానికి సొంతదారులు. పెట్టుబడిదారుల లాభాలను కార్మికులు ఉత్పత్తి చేయడం వల్ల పొందుతారు. ఈ లాభాన్ని ప్రైవేట్ పెట్టుబడిదారులు కూడబెట్టుకున్నంత కాలం కార్మికుల పరిస్థితులు మెరుగుపడవు. కార్మికులు పెట్టుబడిదారీ విధానాన్ని, ప్రైవేట్ ఆస్తి పాలనను కూలదోయాలి. పెట్టుబడిదారులు దోపిడీ నుండి విముక్తి పొందాలంటే ఆస్తులపై సామాజిక నియంత్రణ ఉన్న శీఘ్ర సమూలమైన సామ్యవాద సమాజం నిర్మించుకోవాలని కార్ల్ మార్క్స్ నమ్మాడు. ఇది కమ్యూనిస్టు సమాజం అవుతుంది. పెట్టుబడిదారులతో తమ సంఘర్షణలో కార్మికులు విజయం సాధిస్తారని అతను నమ్మాడు. భవిష్యత్‌లో కమ్యూనిస్ట్ సమాజం సహజ సమాజమవుతుంది.

**కృత్యం**

ప్రైవేట్ ఆస్తికి సంబంధించిన పెట్టుబడిదారీ, సామ్యవాద ఆలోచనల మధ్య రెండు తేడాలు రాయండి.

AP SCERT

### 1.4 సామ్యవాదానికి మద్దతు

1870 నాటికి సామ్యవాద భావనలు ఐరోపా అంతటా వ్యాపించాయి. వారి ప్రయత్నాలను సమన్వయం చేయడానికి, సామ్యవాదులు రెండవ ఇంటర్నేషనల్ అన్న పేరుతో ఒక అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేశారు.

ఇంగ్లాండ్, జర్మనీలోని కార్మికులు మెరుగైన జీవన, పని పరిస్థితుల కోసం పోరాడటానికి సంఘాలను ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఆపద సమయాల్లో సభ్యులకు సహాయం చేయడానికి వారు నిధులను ఏర్పాటు చేశారు. పని గంటలను తగ్గించాలని, ఓటు హక్కు కావాలని వారు డిమాండ్ చేశారు. జర్మనీలో, ఈ సంఘాలు సోషల్ డెమొక్రటిక్ పార్టీ (SPD) తో సన్నిహితంగా పనిచేసి ఆ పార్టీ పార్లమెంటరీ స్థానాలను గెలుచుకోవడానికి సహాయపడింది. 1905 నాటికి సామ్యవాదులు, వ్యాపార సంఘాల సభ్యులు బ్రిటన్‌లో లేబర్ పార్టీని, ఫ్రాన్స్‌లో సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. అయితే, 1914 వరకు, సామ్యవాదులు ఐరోపాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఎన్నడూ విజయం సాధించలేదు. పార్లమెంటరీ రాజకీయాల్లో అత్యధిక సంఖ్యా బలం కలిగి వుండి వారి ఆలోచనలు శాసనరూపం సంతరించుకున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం సంప్రదాయవాదులు, ఉదారవాదులు, రాడికల్స్‌చే నడిపించబడేవి.

#### కృత్యం

ప్రైవేట్ ఆస్తిని తొలగించి, సామూహిక యాజమాన్యాన్ని ప్రవేశపెట్టే సోషలిస్ట్ ఆలోచన గురించి చర్చించడానికి మీ ప్రాంతంలో ఒక సమావేశం ఏర్పాటు చేసారని ఊహించండి. మీరు ఈ క్రింది వారిలో ఒకరైతే సమావేశంలో చేసే ప్రసంగాన్ని వ్రాయండి:

- పొలాల్లో పనిచేసే పేద కూలి
- మధ్యస్థాయి భూయజమాని
- ఇంటి యజమానిగా

AP SCERT




*చిత్రం.2 – ఇది 1871 పారిస్ కమ్యూన్ యొక్క పెయింటింగ్ (లండన్ న్యూస్, 1871 లో చిత్రీకరించబడింది). ఇది 1871 మార్చి, మే నెలల మధ్యకాలంలో పారిస్‌లో జరిగిన ప్రజా తిరుగుబాటు నుండి ఒక సన్నివేశాన్ని చిత్రీకరిస్తుంది. ఇది పారిస్ టౌన్ కౌన్సిల్ (కమ్యూన్) కార్మికులు, సాధారణ ప్రజలు, నిపుణులు, రాజకీయ కార్యకర్తలు, ఇతరులతో కూడిన 'ప్రజల' ప్రభుత్వం ఆక్రమించిన కాలం. ఫ్రెంచ్ రాజ్య విధానాలకు వ్యతిరేకంగా పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో ఈ తిరుగుబాటు ఉద్భవించింది. చివరికి 'పారిస్‌కమ్యూన్' ను ప్రభుత్వ దళాలు అణిచివేశాయి, అయితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సామ్యవాదులు దీనిని సాంఘిక విప్లవానికి నాందిగా భావించి సంబరాలు చేసుకున్నారు. పారిస్ కమ్యూన్ రెండు ముఖ్యమైన వారసత్వాలకు ప్రసిద్ధి చెందింది: ఒకటి, కార్మికుల ఎర్రజెండాతో దానికి గల అనుబంధం. పారిస్‌లోని కమ్యూనార్డ్‌లు (విప్లవకారులు) ఈ జెండాలను ఆమోదించారు. రెండవది 'మార్సెసెలీ' ఇది మొదట 1792లో యుద్ధ గీతంగా వ్రాయబడింది. అది కమ్యూన్‌కు, స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నంగా మారింది.*

# 2 రష్యన్ విప్లవం

ఐరోపాలోని అతి తక్కువ పారిశ్రామికీకరణ చెందిన రాజ్యాలలో ఈ పరిస్థితి తారుమారైంది. 1917 అక్టోబర్ విప్లవం ద్వారా సామ్యవాదులు రష్యాలో ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫిబ్రవరి 1917లో రాచరికం పతనం, అక్టోబర్‌లో జరిగిన సంఘటనలను సాధారణంగా రష్యన్ విప్లవం అంటారు.

ఇది ఎలా జరిగింది? విప్లవం సంభవించినప్పుడు రష్యాలో సామాజిక, రాజకీయ పరిస్థితులు ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానమివ్వడానికి, విప్లవానికి కొన్ని సంవత్సరాల ముందు రష్యాను పరిశీలిద్దాం.



*చిత్రం. 3 - వైట్ హాల్ ఆఫ్ ది వింటర్ ప్యాలెస్, జార్ నికోలస్ II సెయింట్ పీటర్స్‌బర్గ్, 1900.*
ఎర్నెస్ట్ లిప్‌గార్ట్ (1847-1932) చిత్రించారు

## 2.1 రష్యన్ సామ్రాజ్యం 1914

1914లో, జార్ నికోలస్ II రష్యాను, దాని సామ్రాజ్యాన్ని పాలించాడు. మాస్కో చుట్టూ ఉన్న భూభాగంతో పాటు, రష్యన్ సామ్రాజ్యంలో ప్రస్తుత ఫిన్లాండ్, లాట్వియా, లిథువేనియా, ఎస్టోనియా, పోలాండ్‌లోని కొంత ప్రాంతం, ఉక్రెయిన్, బెలారస్, రష్యన్ సామ్రాజ్యంలో భాగాలు ఉండేవి. ఇది పసిఫిక్ వరకు విస్తరించింది. నేటి మధ్య ఆసియా దేశాలతో పాటు జార్జియా, అర్మేనియా, అజర్‌బైజాన్‌లు ఇందులో ఉండేవి. రష్యన్ ఆర్థోడాక్స్ క్రిస్టియానిటీ మెజారిటీ మతంగా ఉండేది. ఇది గ్రీక్ ఆర్థోడాక్స్ చర్చ్ నుండి ఏర్పడింది. కానీ సామ్రాజ్యంలో కాథలిక్కులు, ప్రొటెస్టంట్లు, ముస్లింలు, బౌద్ధులు కూడా ఉన్నారు.




***పటం 4 - 1914 లో యూరప్.***
*ఈ పటం మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో రష్యా సామ్రాజ్యంలో యుద్ధంలో పాల్గొన్న దేశాలను సూచిస్తుంది.*

AP SCERT

## 2.2 ఆర్థిక వ్యవస్థ, సమాజం

ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో, రష్యాలోని అధికశాతం ప్రజలు వ్యవసాయదారులుగా ఉన్నారు. రష్యా సామ్రాజ్య జనాభాలో దాదాపు 85 శాతం మంది వ్యవసాయం ద్వారా జీవనోపాధి పొందారు. ఈ నిష్పత్తి చాలా యూరోపియన్ దేశాల కంటే ఎక్కువగా ఉంది. ఉదాహరణకు, ఫ్రాన్స్, జర్మనీలలో ఈ నిష్పత్తి 40 శాతం నుండి 50 శాతం మధ్య ఉంది. సామ్రాజ్యంలోని సాగుదారులు అమ్మకం కోసం, వారి స్వంత అవసరాల కోసం ఉత్పత్తి చేసారు. రష్యా ప్రధానంగా ధాన్యం ఎగుమతిదారుగా ఉండేది.

పరిశ్రమలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్, మాస్కో ప్రముఖ పారిశ్రామిక ప్రాంతాలుగా ఉండేవి. వృత్తిపనివారు ఎక్కువ భాగం ఉత్పత్తిని చేసేవారు. కానీ క్రాఫ్ట్ వర్క్‌షాప్‌లతో పాటు పెద్ద కర్మాగారాలు ఉండేవి. 1890లలో రష్యాలో రైల్వేలు విస్తరించినప్పుడు అనేక కర్మాగారాలు స్థాపించారు. పరిశ్రమలో విదేశీ పెట్టుబడులు పెరిగాయి. బొగ్గు ఉత్పత్తి రెట్టింపు అయి, ఇనుము, ఉక్కు ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగింది. 1900ల నాటికి, కొన్ని ప్రాంతాల్లో ఫ్యాక్టరీ కార్మికులు, వృత్తిపనివారు దాదాపు సమానంగా ఉన్నారు.

చాలా పరిశ్రమలు పారిశ్రామికవేత్తల ప్రైవేట్ ఆస్తిగా ఉండేవి. పెద్ద కర్మాగారాలలో కనీస వేతనాలు, పరిమిత పని గంటలు ఉండేలా ప్రభుత్వం పర్యవేక్షించేది. కానీ ఫ్యాక్టరీ పర్యవేక్షణాధికారులు నిబంధనలను ఉల్లంఘించడాన్ని అరికట్టలేకపోయారు. కార్మాగారాలలో పని గంటలు 10 లేదా 12 తో పోలిస్తే, చేతివృత్తుల కేంద్రాల్లోను, చిన్న వర్క్‌షాప్‌లలో కొన్నిసార్లు 15 గంటలు ఉండేవి. వసతి, గదులలోను, డార్మిటరీలలోను ఏర్పాటుచేయబడేది.

కార్మికులు ఒక విభజింపబడిన సామాజిక సమూహంగా ఉండేవారు. కొంతమందికి తాము వచ్చిన గ్రామాలతో బలమైన సంబంధాలు ఉండేవి. మరికొంతమంది నగరాలలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. కార్మికులను నైపుణ్యం ఆధారంగా విభజించబడ్డారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఒక లోహ కార్మికుడు ఇలా గుర్తుచేసుకున్నాడు, "లోహ కార్మికులు ఇతర కార్మికులలో తమను తాము కులీనులుగా భావించారు. వారి వృత్తులకు ఎక్కువ శిక్షణ, నైపుణ్యం అవసరమవుతుంది...." "1914 నాటికి ఫ్యాక్టరీ శ్రామిక శక్తిలో 31 శాతం మంది మహిళలు ఉన్నారు, కానీ వారికి పురుషుల కంటే తక్కువ జీతం చెల్లించేవారు (పురుషుని వేతనంలో నాలుగింట మూడు వంతులు). కార్మికుల మధ్య విభజనలకు అనుగుణంగా వారి దుస్తులు, ప్రవర్తనా రీతులు ఉండేవి. దుస్తులు, మర్యాదలలో కూడా కార్మికుల మధ్య విభజనలను చూపించారు. నిరుద్యోగం లేదా ఆర్థిక ఇబ్బందుల సమయాల్లో సభ్యులకు సహాయం చేయడానికి కొంతమంది కార్మికులు సంఘాలను ఏర్పాటు చేశారు. కానీ అలాంటి సంఘాలు తక్కువగా ఉన్నాయి.

తమలో విభేదాలు ఉన్నప్పటికి తొలగింపులు పని పరిస్థితుల గురించి యజమానులతో విభేదించి సమ్మె చేసేందుకు కార్మికులు ఏకమయ్యేవారు. ఈ సమ్మెలు 1896–1897లో వస్త్ర పరిశ్రమలో, 1902లో లోహ పరిశ్రమలో తరచుగా జరిగాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ భూమిని రైతులు సాగు చేశారు. కానీ సంపన్నులు, రాజులు, ఆర్థోడాక్స్ చర్చ్‌కి పెద్ద మొత్తంలో ఆస్తులు ఉండేవి. కార్మికుల మాదిరిగానే రైతులు కూడా విభజింపబడ్డారు.



**చిత్రం.5 – యుద్ధానికి ముందు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని నిరుద్యోగ రైతులు.**
చారిటబుల్ కిచెన్‌లలో తినడం, పేదల ఇళ్లలో నివసించడం ద్వారా చాలా మంది జీవించారు.



**చిత్రం.6 – విప్లవానికి ముందు రష్యాలో డార్మిటరీలలోని బంకర్లలో నిద్రిస్తున్న కార్మికులు.**
వారు షిఫ్టులలో పడుకున్నారు, వారి కుటుంబాలను వారితో ఉంచుకోలేరు.

AP SCERT

వారు కూడా ప్రగాఢమైన మతవిశ్వాసాలుగలవారు. కానీ కొన్ని సందర్భాలలో తప్ప వారికి ప్రభువుల పట్ల గౌరవం ఉండేది కాదు. ప్రభువులకు స్థానిక ప్రజాదరణ ద్వారా కాకుండ, జార్‌కి సేవ చేయడం ద్వారా అధికారం, హోదా లభించేవి. ఇది ఫ్రెంచ్ విప్లవం సమయంలోని ఫ్రాన్స్ వలె కాకుండా, బ్రిటానిలోని రైతులు ప్రభువులను గౌరవించి వారి కోసం పోరాడారు. ఇక్కడ అలా జరగలేదు. రష్యాలో రైతులు తమకు ప్రభువుల భూమి తమకు ఇవ్వాలని కోరుకున్నారు. వారు తరచుగా కౌలు చెల్లించటానికి నిరాకరించి భూస్వాములను కూడా హత్య చేశారు. 1902 లో ఇది దక్షిణ రష్యాలో పెద్ద ఎత్తున జరిగింది. 1905లో ఇటువంటి సంఘటనలు రష్యా అంతటా జరిగాయి.

రష్యన్ రైతులు ఇతర యూరోపియన్ రైతులు నుండి మరొక విధంగా భిన్నంగా ఉండేవారు. వారు వారి భూమిని కాలానుగుణంగా సమీకరించారు. వారి కమ్యూన్ (మిర్) దీనిని వ్యక్తిగత కుటుంబాల అవసరాలకు అనుగుణంగా విభజించేది.

## 2.3 రష్యాలో సామ్యవాదం

1914కి ముందు రష్యాలో అన్ని రాజకీయ పార్టీలు చట్టవిరుద్ధమైనవిగా ఉండేవి. మార్క్స్ భావనలను గౌరవించే సామ్యవాదులు 1898లో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ వర్కర్స్ పార్టీని స్థాపించారు. అయినప్పటికీ ప్రభుత్వ నిబంధనల కారణంగా, అది చట్టవిరుద్ధమైన సంస్థగా పనిచేయవలసి వచ్చింది. అది వార్తాపత్రికను ఏర్పాటు చేసి, కార్మికులను సమీకరించి సమ్మెలను నిర్వహించింది.

కాలానుగుణంగా భూమిని విభజించుకునే రష్యన్ రైతుల ఆచారం తమని సహజ సామ్యవాదులుగా మార్చిందని కొంతమంది రష్యన్ సామ్యవాదులు భావించారు. అందువల్ల కార్మికులు కాకుండా రైతులు విప్లవానికి ప్రధాన శక్తిగా ఉంటారు. ఇతర దేశాల కంటే రష్యా త్వరగా సామ్యవాద దేశంగా మారింది. పంతొమ్మిదవ శతాబ్దం చివరి వరకు సామ్యవాదులు గ్రామీణ ప్రాంతాల్లో క్రియాశీలకంగా ఉండేవారు. 1900లో వారు సోషలిస్ట్ రివల్యూషనరీ పార్టీని స్థాపించారు. ఈ పార్టీ రైతుల హక్కుల కోసం పోరాడింది. ప్రభువులకు చెందిన భూమిని రైతులకు బదిలీచేయాలని డిమాండ్ చేసింది. రైతుల గురించి సోషలిస్ట్ రివల్యూషనరీలతో సోషల్ డెమోక్రాట్లు ఏకీభవించలేదు. రైతులు ఒక ఐక్య సమూహానికి చెందిన వారు కాదని లెనిన్ భావించాడు. వీరిలో కొందరు పేదవారు, మరికొందరు ధనవంతులు, మరికొందరు కూలీలుగా పనిచేశారు, మరికొందరు కార్మికులకు ఉపాధి కల్పించే పెట్టుబడి దారులుగా ఉన్నారు. వారిలోని ఈ 'విభజన' కారణంగా, వారందరూ సాంఘిక సామ్యవాద ఉద్యమంలో భాగం కాలేకపోయారు.

సంస్థాగత వ్యూహం విషయంలో పార్టీ విడిపోయింది. వ్లాదిమిర్ లెనిన్ (బోల్షివిక్ సమూహానికి నాయకత్వం వహించినవాడు) జారిస్ట్ రష్యా వంటి అణచివేతకు గురైన సమాజంలో పార్టీ క్రమశిక్షణతో ఉండి, దాని సభ్యుల సంఖ్య, నాణ్యతను నియంత్రించాలని భావించాడు. మరికొందరు (మెన్షివిక్‌లు) పార్టీ అందరికీ అందుబాటులో ఉండాలని (జర్మనీలో వలె) భావించారు.

## 2.4 ఒక అల్లకల్లోలమైన సమయం: 1905 విప్లవం

రష్యా నిరంకుశ దేశంగా ఉండేది. ఇతర యూరోపియన్ పాలకుల మాదిరిగా కాకుండా, ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో కూడా, జార్ పార్లమెంటుకు లోబడి ఉండలేదు.

**మూలం *A***

ఆనాటి సోషలిస్ట్ వర్కర్ అలెగ్జాండర్ ష్లియాప్నికోవ్, సమావేశాలు ఎలా నిర్వహించబడ్డాయో మనకు వివరించాడు:

'వ్యక్తిగత ప్రాతిపదికన ఉత్పత్తి కేంద్రాలలో, దుకాణాల్లో ప్రచారం జరిగింది. చర్చా కేంద్రాలు కూడా ఉన్నాయి...సంబంధిత [అధికారిక సమస్యల] విషయాలపై చట్టపరమైన సమావేశాలు జరిగాయి. అయితే శ్రామిక వర్గ విముక్తి కోసం జరిగిన సాధారణ పోరాటంలో ఈ కార్యక్రమమును చాకచక్యంగా చేర్చారు. కార్యాచరణను నైపుణ్యంగా చేర్చారు. చట్టవిరుద్ధమైన సమావేశాలు... అప్పటికప్పుడు ఏర్పాట్లు చేసేవారు. కానీ లంచ్ సమయంలో, సాయంత్రం విరామంలో, నిష్క్రమణకు ముందు, యార్డ్‌లో లేదా అనేక అంతస్తులతో కూడిన స్థావరాలలో, మెట్లపై ఏర్పాటు చేసేవారు. అత్యంత అప్రమత్తమైన కార్మికులు ద్వారంలో ఒక "ప్లగ్"ని ఏర్పరుస్తారు. నిష్క్రమణ సమయంలో మొత్తం గుంపు గుమిగూడతారు. ఆందోళనకారులు అక్కడికక్కడే సమావేశమవుతారు. మేనేజ్‌మెంట్ పోలీసు వారిని టెలిఫోన్‌లో సంప్రదిస్తుంది, కాని వారు వచ్చే సమయానికి ప్రసంగాలు అయిపోయేవి. అవసరమైన నిర్ణయం తీసేసుకునేవారు.

అలెగ్జాండర్ ష్లియాప్నికోవ్, 1917 సందర్భంగా *రెమినిసెన్స్ ఫ్రమ్ ద రివల్యూషనరీ అండర్‌గ్రౌండ్*

AP SCERT

రష్యాలోని ఉదారవాదులు ఈ పరిస్థితిని అంతం చేయాలని ప్రచారం చేశారు. సామాజిక ప్రజాస్వామ్యవాదులు, సోషలిస్ట్ విప్లవకారులు రైతులు, కార్మికులతో కలిసి 1905 విప్లవం సమయంలో రాజ్యాంగాన్ని డిమాండ్ చేశారు. సామ్రాజ్యంలోని జాతీయవాదులకు (ఉదాహరణకు పోలాండ్‌లో) ముస్లిం-ఆధిపత్య ప్రాంతాలలో తమ సమాజాలను నడిపించడానికి ఆధునీకరించిన ఇస్లాంను కోరుకునే జాడిడిస్టుల నుంచి వారికి మద్దతు లభించింది.

1904 సంవత్సరం రష్యన్ కార్మికులకు కష్టకాలంగా ఉండేది. నిత్యావసర వస్తువుల ధరలు చాలా త్వరగా పెరిగాయి. వాస్తవ వేతనాలు 20 శాతం తగ్గాయి. కార్మికులకు సంఘాల సభ్యత్వాలు నాటకీయంగా పెరిగాయి. 1904లో ఏర్పడిన రష్యన్ వర్కర్స్ అసెంబ్లీలోని నలుగురు సభ్యులను పుతిలోవ్ ఐరన్ వర్క్స్‌లో తొలగించినప్పుడు, పారిశ్రామిక చర్య కోసం పిలుపు వచ్చింది. తరువాతి కొద్ది రోజుల్లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని 110,000 మంది కార్మికులు పని దినాన్ని ఎనిమిది గంటలకు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, పని పరిస్థితులను మెరుగుపరచాలని కోరుతూ సమ్మె చేశారు.

ఫాదర్ గపోన్ నేతృత్వంలోని కార్మికుల ఊరేగింపు వింటర్ ప్యాలెస్‌కు చేరుకున్నప్పుడు, పోలీసులు, కోసాక్కులు దానిపై దాడి చేశారు. 100 మందికి పైగా కార్మికులు మరణించారు. సుమారు 300 మంది గాయపడ్డారు. రక్తపాత ఆదివారంగా పిలువబడే ఈ సంఘటన అనేక వరుస సంఘటనలకు కారణమై 1905 విప్లవంగా ప్రసిద్ధి చెందింది. పౌర హక్కులు లేవని ఫిర్యాదు చేస్తూ విద్యార్థి సంఘాలు వాకౌట్‌లు చేసినప్పుడు దేశవ్యాప్తంగా సమ్మెలు జరిగి విశ్వవిద్యాలయాలు మూసివేయబడ్డాయి. న్యాయవాదులు, వైద్యులు, ఇంజనీర్లు, ఇతర మధ్యతరగతి కార్మికులు యూనియన్ ఆఫ్ యూనియన్స్‌ను స్థాపించారు. వారు రాజ్యాంగ అసెంబ్లీని డిమాండ్ చేశారు.

1905 విప్లవ సమయంలో, జార్ ఎలెక్టెడ్ కన్సల్టేటివ్ పార్లమెంట్ లేదా డ్యూమా ఏర్పాటుకు అనుమతించాడు. విప్లవం సమయంలో కొంతకాలం పాటు, పెద్ద సంఖ్యలో వ్యాపార సంఘాలు, ఫ్యాక్టరీ కార్మికులతో కూడిన ఫ్యాక్టరీ కమిటీలు ఉన్నాయి. 1905 తర్వాత, చాలా కమిటీలు, యూనియన్లు చట్టవిరుద్ధంగా ప్రకటించబడినందున అవి అనధికారికంగా పని చేశాయి. రాజకీయ కార్యకలాపాలపై తీవ్ర ఆంక్షలు విధించారు. జార్ 75 రోజులలోపే మొదటి డ్యూమాను తొలగించాడు. తిరిగి ఎన్నికైన రెండవ డ్యూమాను మూడు నెలల్లో తొలగించాడు. అతను తన అధికారం ప్రశ్నించడం లేదా తన అధికారాన్ని తగ్గింపబడటం కాని కోరుకోలేదు. అతను ఓటింగ్ చట్టాలను మార్చాడు. సంప్రదాయిక రాజకీయ నాయకులతో మూడవ డ్యూమాను ఏర్పాటు చేశాడు. ఉదారవాదులు, విప్లవకారులను దూరంగా ఉంచారు.

**2.5 మొదటి ప్రపంచ యుద్ధం, రష్యన్ సామ్రాజ్యం**

1914 లో, రెండు యూరోపియన్ కూటముల మధ్య యుద్ధం ప్రారంభమైయింది- జర్మనీ, ఆస్ట్రియా, టర్కీ (కేంద్ర శక్తులు)కు, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా (తరువాత ఇటలీ, రొమేనియా) మధ్య యుద్ధం ప్రారంభమైంది. ప్రతి దేశానికి ప్రపంచ సామ్రాజ్యం ఉంది.

**కృత్యం**

1905లో రష్యాలో విప్లవాత్మకమైన అలజడులు ఎందుకు జరిగాయి? విప్లవకారుల డిమాండ్లు ఏమిటి?

**కొత్త పదాలు**

జాడిడిస్టులు - రష్యన్ సామ్రాజ్యంలోని ముస్లిం సంస్కర్తలు

నిజమైన వేతనం - వేతనాలలో కొనుగోలు చేసే వస్తువుల పరిమాణాలను ప్రతిబింబిస్తుంది.

AP SCERT

యుద్ధం ఐరోపాకు వెలుపల అలాగే ఐరోపాలోను జరిగింది. ఇదే మొదటి ప్రపంచ యుద్ధం.

రష్యాలో, యుద్ధం ప్రారంభంలో ప్రజాదరణ పొందింది. ప్రజలు జార్ నికోలస్ II కు మద్దతు పలికారు. అయితే యుద్ధం కొనసాగినందున డ్యూమాలోని ప్రధాన పార్టీలను సంప్రదించడానికి జార్ నిరాకరించాడు. మద్దతు సన్నగిల్లింది. జర్మనీ పేరైన సెయింట్ పీటర్స్‌బర్గ్‌ను పెట్రోగ్రాడ్ గా మార్చుచేసేంతగా జర్మన్ వ్యతిరేక భావాలు తీవ్రంగా పెరిగాయి. జర్మన్ మూలాలున్న సారినా అలెగ్జాండ్రా, అసమర్థ సలహాదారులు, ముఖ్యంగా రస్‌పుతిన్ అనే సన్యాసి రాచరికాన్ని అప్రతిష్టపాలు చేశాడు.

మొదటి ప్రపంచ యుద్ధం విషయంలో 'తూర్పు దేశాల కూటమి' 'పశ్చిమ దేశాల కూటమి' కి భిన్నంగా ఉంది. పశ్చిమాన తూర్పు ఫ్రాన్స్ వెంట విస్తరించిన కందకాల నుండి సైన్యాలు పోరాడాయి. తూర్పు సైన్యాలు ఒక పథకం ప్రకారం కదులుతూ పెద్ద ప్రాణనష్టం కలిగిస్తూ ముందుకు సాగాయి. ఓటమి దిగ్భ్రాంతిని కలిగిస్తూ నిరుత్సాహపరిచింది. రష్యా సైన్యాలకు 1914–1916 మధ్య జర్మనీ, ఆస్ట్రియాలో తీవ్ర నష్టం వాటిల్లింది. 1917 నాటికి 7 మిలియన్లకు పైగా మరణాలు సంభవించాయి. దీనితో వెనక్కి తగ్గిన రష్యా సైన్యం శత్రువులు భూమిపై నివసించకుండా చేయడానికి పంటలు, భవనాలను ధ్వంసం చేశారు. పంటలు, భవనాలు ధ్వంసం చేయడం వల్ల రష్యాలో 3 మిలియన్‌లకు పైగా ప్రజలు శరణార్థులయ్యారు. ఈ పరిస్థితి వల్ల ప్రభుత్వం, జారులు అపఖ్యాతికి గురైనారు. సైనికులు అటువంటి యుద్ధాన్ని కోరుకోలేదు.



చిత్రం. 7 – మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో రష్యన్ సైనికులు.

ఇంపీరియల్ రష్యన్ సైన్యాన్ని 'రష్యన్ స్టీమ్ రోలర్' అని పిలిచేవారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సాయుధ దళం. ఈ సైన్యం తన విధేయతను మార్చుకుని విప్లవకారులకు మద్దతు ఇవ్వడం ప్రారంభించినప్పుడు, జారిస్ట్ శక్తి కూలిపోయింది.

ఈ యుద్ధం పరిశ్రమపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. రష్యాకు స్వంత పరిశ్రమలు తక్కువగా ఉండేవి. బాల్టిక్ సముద్రంపై జర్మన్ నియంత్రణ వల్ల దేశంతో ఇతర పారిశ్రామిక వస్తువుల సరఫరాదారులతో సంబంధం తెగిపోయింది. ఐరోపాలోని ఇతర ప్రాంతాల కంటే రష్యాలో పారిశ్రామిక పరికరాలు చాలా వేగంగా విచ్ఛిన్నమయ్యాయి. 1916 నాటికి, రైల్వే లైన్లు విచ్ఛిన్నం కావడం ప్రారంభమైయింది. సమర్థులైన వారిని యుద్ధానికి పిలిచారు. ఫలితంగా కూలీల కొరత ఏర్పడి నిత్యావసర వస్తువులను ఉత్పత్తి చేసే చిన్న చిన్న కార్ఖానాలు మూతపడినాయి. సైన్యానికి ఆహారం ఇవ్వడానికి పెద్ద మొత్తంలో ధాన్యం తరలించారు. నగరాల్లోని ప్రజలకు రొట్టెలు, పిండి కరువయ్యాయి. 1916 శీతాకాలం నాటికి, రొట్టెల దుకాణాల వద్ద అల్లర్లు సాధారణమయ్యాయి.

## కృత్యం

అది 1916 సంవత్సరం. మీరు తూర్పు ఫ్రంట్ జార్ సైన్యంలో ఒక జనరల్‌గా ఉన్నారు. మీరు మాస్కోలో ప్రభుత్వానికి ఒక నివేదిక వ్రాస్తున్నారు. పరిస్థితిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ఏమి చేయాలని మీరు భావిస్తున్నారో మీ నివేదికలో సూచించండి.

AP SCERT

## 3 పెట్రోగ్రాడ్‌లో ఫిబ్రవరి విప్లవం

1917 శీతాకాలంలో రాజధాని పెట్రోగాడ్‌లో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. నగరం యొక్క రూపురేఖలు దాని ప్రజల మధ్య విభేదాలను ప్రస్ఫుటం చేస్తున్నాయి. కార్మికుల క్వార్టర్స్, కర్మాగారాలు నెవా నదికి కుడి ఒడ్డున ఉన్నాయి. ఎడమ ఒడ్డున ఫ్యాషనబుల్ ప్రాంతాలు, వింటర్ ప్యాలెస్, అధికారిక భవనాలు డ్యూమా సమావేశాలు జరిగే రాజభవనం ఉన్నాయి.

1917 ఫిబ్రవరిలో, కార్మికుల నివాసాలలో ఆహార కొరత తీవ్రంగా ఏర్పడింది. అసాధారణంగా గడ్డకట్టిన మంచులో ఆ శీతాకాలం చాలా చల్లగా వుంది. ఎన్నికైన ప్రభుత్వాన్ని కాపాడాలని కోరుకునే పార్లమెంటు సభ్యులు డ్యూమాను రద్దు చేయాలనే జార్ కోరికను వ్యతిరేకించారు.

ఫిబ్రవరి 22న, కుడి ఒడ్డున ఉన్న కర్మాగారాలను తాత్కాలికంగా మూసివేశారు. మరుసటి రోజు దీనికి సానుభూతిగా యాభై కర్మాగారాల్లోని కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. చాలా ఫ్యాక్టరీలలో, మహిళలు సమ్మెలకు నాయకత్వం వహించారు. దీనిని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పిలుస్తారు. కార్మికులు ఊరేగింపుగా ఫ్యాక్టరీ క్వార్టర్స్ నుండి రాజధాని మధ్యలోని నెవ్స్కీ ప్రోస్పెక్ట్ చేరుకున్నారు. ఈ దశలో ఏ రాజకీయ పార్టీ కూడా ఉద్యమాన్ని చురుగ్గా నిర్వహించలేదు. అధునాతన నివాస భవనాలను, అధికారిక భవనాలను కార్మికులు చుట్టు ముట్టడంతో, ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. సాయంత్రానికి ప్రదర్శనకారులు వెళ్ళిపోయారు. కానీ వారు 24, 25 తేదీల్లో తిరిగి వచ్చారు. వారిపై నిఘావేసి ఉంచడానికి ప్రభుత్వం అశ్విక దళాన్ని, పోలీసులను పిలిపించింది.

ఫిబ్రవరి 25 ఆదివారం రోజు ప్రభుత్వం డ్యూమాను రద్దు చేసింది. రాజకీయ నాయకులు ఈ చర్యకు వ్యతిరేకంగా ఆవేశంతో మాట్లాడారు. ప్రదర్శనకారులు 26వ తేదీన ఎడమ గట్టు వైపు ఉన్న వీధుల్లోకి తిరిగి వచ్చారు. 27వ తేదీన పోలీసు హెడ్‌క్వార్టర్స్‌ను ధ్వంసం చేశారు. రొట్టె, వేతనాలు, మెరుగైన పని గంటలు, ప్రజాస్వామ్యం గురించి నినాదాలు చేస్తున్న ప్రజలతో వీధులు కిక్కిరిసిపోయాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించి మరోసారి అశ్విక దళాన్ని రప్పించింది. అయితే, ప్రదర్శనకారులపై కాల్పులు జరపడానికి అశ్వికదళం నిరాకరించింది. ఒక రెజిమెంట్ యొక్క బ్యారక్ వద్ద ఒక అధికారిని కాల్చారు. సమ్మె చేస్తున్న కార్మికులతో అంగీకరిస్తూ మరో మూడు రెజిమెంట్లు తిరుగుబాటు చేసాయి, ఆ సాయంత్రం నాటికి, సైనికులు, సమ్మెచేస్తున్న




*చిత్రం 8. – డ్యూమా లో పెట్రోగ్రాడ్ సోవియట్ సమావేశం, ఫిబ్రవరి 1917.*

AP SCERT

కార్మికులు డ్యూమా సమావేశమైన అదే భవనంలో 'సోవియట్' లేదా 'కౌన్సిల్' ఏర్పాటుకు సమావేశమయ్యారు అదే పెట్రోగ్రాడ్ సోవియట్.

మరుసటి రోజు, ఒక ప్రతినిధి బృందం జార్‌ను కలవడానికి వెళ్ళింది. అతనిని స్వచ్ఛందాగానే పదవిని మిలటరీ కమాండర్లు త్యజించమని సలహా ఇచ్చారు. వారి సలహాను అనుసరించి మార్చి 2న అతడు పదవిని త్యజించాడు. సోవియట్ నాయకులు డ్యూమా నాయకులు దేశ పరిపాలనకు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఓటు హక్కు ఆధారంగా ఎన్నుకోబడిన రాజ్యాంగ సభ రష్యా భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఫిబ్రవరి 1917లో రాచరికాన్ని తొలగించిన ఫిబ్రవరి విప్లవానికి పెట్రోగ్రాడ్ నాయకత్వం వహించింది.

**పెట్టె 1**

ఫిబ్రవరి విప్లవంలో మహిళలు

'మహిళా కార్మికులు, తరచుగా ... వారి పురుష సహోద్యోగులను ఉత్సాహపరిచేవారు ... లోరెంజ్ టెలిఫోన్ ఫ్యాక్టరీలో, మార్ఫా వాసిలెవా ఒక్కతే సమ్మెను విజయవంతంగా నిర్వహించింది. ఆ రోజు ఉదయం జరిగిన మహిళా దినోత్సవ వేడుకలో, మహిళా కార్మికులు పురుషులకు ఎర్ర మెడపట్టీలను బహుమతిగా ఇచ్చారు... అప్పుడు మార్ఫా వాసిలెవా అనే ఒక మిల్లింగ్ యంత్రం ఆపరేటర్ పని నిలిపివేసి ఒక తక్షణ సమ్మె ప్రకటించింది. అక్కడ ఉన్న కార్మికులు ఆమెకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. .. ఫోర్మన్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చి ఆమెకు రొట్టె పంపించాడు. ఆమె రొట్టెను తీసుకుంది కానీ తిరిగి పనికి వెళ్ళడానికి నిరాకరించింది. ఆమె పని చేయడానికి ఎందుకు నిరాకరించింది అని నిర్వాహకుడు ఆమెను మళ్లీ అడిగాడు. ఆమె ఇలా సమాధానం ఇచ్చింది, "ఇతరులు ఆకలితో ఉన్నప్పుడు నేను మాత్రమే సంతృప్తి చెందలేను." కర్మాగారంలోని మరో విభాగానికి చెందిన మహిళా కార్మికులు ఆమెకు మద్దతుగా మార్ఫా చుట్టూ గుమిగూడారు, క్రమంగా ఇతర మహిళలందరూ పనిచేయడం మానేశారు. వెంటనే పురుషులు కూడా పని వదిలేసి సమ్మెకి దిగారు. వీరంతా వీధిలోకి పరుగులు తీసారు.'

ఆధారం: చోయ్ చాటర్జీ, సెలబ్రేటింగ్ ఉమెన్ (2002).

AP SCERT

## 3.1 ఫిబ్రవరి తరువాత

సైనికాధికారులు, భూస్వాములు, పారిశ్రామికవేత్తలు తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్నారు. కానీ వారిలో ఉన్న ఉదారవాదులు, సోషలిస్టులు ఎన్నికైన ప్రభుత్వం తరఫున పనిచేశారు. బహిరంగ సభలు, సంఘాలపై ఉన్న ఆంక్షలను తొలగించారు. ఎలాంటి సాధారణ ఎన్నికల విధానాన్ని అనుసరించకపోయినా పెట్రోగ్రాడ్ సోవియట్ వంటి 'సోవియట్'లను ప్రతిచోటా ఏర్పాటు చేసారు.

ఏప్రిల్ 1917 లో, బోల్షెవిక్ నాయకుడు వ్లాదిమిర్ లెనిన్ తన అజ్ఞాతం నుండి రష్యాకు తిరిగి వచ్చాడు. 1914 నుండి అతను మరియు బోల్షెవిక్‌లు యుద్ధాన్ని వ్యతిరేకించారు. ఇప్పుడు సోవియెట్లు అధికారం చేపట్టే సమయం ఆసన్నమైందని భావించాడు. యుద్ధం ముగింపుకు తీసుకురావాలని, భూమిని రైతులకు పంపిణీ చేయాలని, బ్యాంకులను జాతీయం చేయాలని అతను ప్రకటించాడు. ఈ మూడు డిమాండ్లే లెనిన్ 'ఏప్రిల్ సిద్ధాంతాలు'. రాడికల్ లక్ష్యాలను ప్రతిబింబించేవిధంగా బోల్షెవిక్ పార్టీని కమ్యూనిస్ట్ పార్టీగా మార్చాలని అతను వాదించాడు. మొదట బోల్షెవిక్ పార్టీలో చాలామంది ఏప్రిల్ సిద్ధాంతాల పట్ల ఆశ్చర్యపోయారు. సామ్యవాద విప్లవానికి సమయం ఇంకా ఆసన్నం కాలేదని, తాత్కాలిక

### కృత్యం

మూలం A మరియు బాక్స్ 1 వద్ద మళ్లీ చూడండి.

- కార్మికుల మానసిక స్థితిలో వచ్చిన ఐదు మార్పులను రాయండి.
- రెండు పరిస్థితులను చూసిన మహిళ స్థానంలో నీవు ఉన్నావని భావించు. మారిన పరిస్థితుల గురించి ఒక కథనం రాయి.

ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు భావించారు. కానీ తరువాతి నెలలలో జరిగిన పరిణామాలు వారి వైఖరిని మార్చాయి.

వేసవిలో కార్మికుల ఉద్యమం విస్తరించింది. పారిశ్రామిక ప్రాంతాలలో, ఫ్యాక్టరీ కమిటీలు ఏర్పడ్డాయి. ఇవి పారిశ్రామికవేత్తలు తమ కర్మాగారాలను నడిపే విధానాన్ని ప్రశ్నించడం ప్రారంభించాయి. కార్మిక సంఘాల సంఖ్య పెరిగింది. సైన్యంలో సైనికుల కమిటీలు ఏర్పడ్డాయి. జూన్‌లో, దాదాపు 500 మంది సోవియట్‌లు ఆల్ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ సోవియట్‌లకు ప్రతినిధులను పంపారు. తాత్కాలిక ప్రభుత్వం తన శక్తి తగ్గిపోవడం, బోల్షివిక్ ప్రభావం పెరగడం చూసినందున, వ్యాపిస్తున్న అసంతృప్తికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. కర్మాగారాలను నడపడానికి కార్మికులు చేసిన ప్రయత్నాలను అది ప్రతిఘటించి, నాయకులను అరెస్టు చేయడం ప్రారంభించింది. జూలై 1917లో బోల్షెవిక్‌లు నిర్వహించిన ప్రజాదరణ పొందిన నిరసన ఉద్యమాలను కఠినంగా అణచివేశారు. చాలా మంది బోల్షెవిక్ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లవలసి వచ్చింది లేదా పారిపోవాల్సి వచ్చింది. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వారి సోషలిస్ట్ విప్లవ నాయకులు భూమిని పునఃపంపిణీ చేయాలని ఒత్తిడి చేశారు. వీటి నిర్వహణకు ల్యాండ్‌కమిటీలు ఏర్పాటు చేశారు. సోషలిస్ట్ విప్లవకారులచే ప్రోత్సహించబడిన రైతులు 1917 జూలై, సెప్టెంబర్ మధ్య భూమిని స్వాధీనం చేసుకున్నారు.



*చిత్రం 9 – ఏప్రిల్ 1917 లో కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న లెనిన్ బోల్షెవిక్ చిత్రం*



***చిత్రం 10 : జూలై రోజులు** 1917 జూలై 17న బోల్షెవిక్ అనుకూల ప్రదర్శనపై సైన్యాలు కాల్పులు జరుపుతున్న దృశ్యం.*

AP SCERT

## 3.2 అక్టోబర్ 1917 విప్లవం

తాత్కాలిక ప్రభుత్వం, బోల్షెవిక్ మధ్య సంఘర్షణ పెరగడంతో, తాత్కాలిక ప్రభుత్వం నియంతృత్వానికి పాల్పడుతుందని లెనిన్ భయపడ్డాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు కోసం అతను సెప్టెంబర్‌లో చర్చలు ప్రారంభించాడు. సోవియట్‌లు, కర్మాగారాలు, సైన్యంలోని బోల్షెవిక్ మద్దతుదారులను ఏకంచేసారు.

1917 అక్టోబరు 16న, లెనిన్ పెట్రోగ్రాడ్ సోవియట్, బోల్షివిక్ పార్టీని సోషలిస్టు విధానంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అంగీకరించమని ఒప్పించాడు. స్వాధీనం చేసుకోవడానికి లియోన్ ట్రోట్స్కీ ఆధ్వర్యంలో సోవియట్ ఒక సైనిక విప్లవ కమిటీని నియమించింది. ఆ తేదీని రహస్యంగా ఉంచారు.

తిరుగుబాటు అక్టోబర్ 24 న ప్రారంభమైంది. సమస్యను పసిగట్టిన ప్రధాని కెరెన్స్కీ సైనిక దళాలను రప్పించటానికి నగరం నుండి బయలుదేరాడు. తెల్లవారుజామున, ప్రభుత్వానికి విధేయులైన సైనికులు, రెండు బోల్షెవిక్ వార్తాపత్రిక భవనాలను స్వాధీనం చేసుకున్నారు. టెలిఫోన్, టెలిగ్రాఫ్ కార్యాలయాలను స్వాధీనం చేసుకోవడానికి, వింటర్ ప్యాలెస్‌ను రక్షించడానికి ప్రభుత్వ అనుకూల దళాలను పంపారు. వెంటనే స్పందించిన సైనిక విప్లవ కమిటీ ప్రభుత్వ కార్యాలయాలను స్వాధీనం చేసుకోవాలని, మంత్రులను అరెస్టు చేయాలని తన మద్దతుదారులకు ఆదేశించింది. అరోరా ఓడ వింటర్ ప్యాలెస్‌పై దాడి చేసింది కాని ఆశించిన ఫలితం రాలేదు. ఇతర ఓడలు నెవాలో ప్రయాణించి వివిధ సైనిక స్థావరాలను స్వాధీనం చేసుకున్నాయి. చీకటి పడే సమయానికి నగరం కమిటీ నియంత్రణలో ఉంది. మంత్రులు లొంగిపోయారు. పెట్రోగ్రాడ్‌లో జరిగిన ఆల్ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ సోవియట్‌ల సమావేశంలో మెజారిటీ సభ్యులు బోల్షెవిక్ చర్యను ఆమోదించారు. ఇతర నగరాల్లో తిరుగుబాట్లు జరిగాయి. భారీ పోరాటాలు – ముఖ్యంగా మాస్కోలో జరిగాయి. – కానీ డిసెంబర్ నాటికి, బోల్షెవిక్‌లు మాస్కో–పెట్రోగ్రాడ్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోనికి తెచ్చుకున్నారు.

**పెట్టె 2**

**రష్యన్ విప్లవం తేదీ**

ఫిబ్రవరి 1, 1918 వరకు రష్యా జూలియన్ క్యాలెండర్‌ను అనుసరించింది. అప్పటి నుంచి ప్రపంచమంత ఉపయోగిస్తున్న గ్రెగోరియన్ క్యాలెండర్‌కు మారింది, దీనిని నేడు అన్నిచోట్లా అనుసరిస్తున్నారు. గ్రెగోరియన్ తేదీలు జూలియన్ తేదీల కంటే 13 రోజులు ముందు ఉంటాయి. కాబట్టి మన క్యాలెండర్ ప్రకారం, 'ఫిబ్రవరి' విప్లవం మార్చి 12న, 'అక్టోబర్' విప్లవం నవంబర్ 7న జరిగాయి.

కొన్ని ముఖ్యమైన తేదీలు

1850 –1880 మధ్య
రష్యన్ సోషలిజంపై చర్చలు.

1898
రష్యన్ సోషల్ డెమోక్రటిక్ వర్కర్స్ పార్టీ ఏర్పాటు.

1905
రక్తపాత ఆదివారం 1905 యొక్క విప్లవం.

1917
2nd మార్చి – జార్ సింహాసనాన్ని త్యజించడం.
24th అక్టోబర్ – పెట్రోగ్రాడ్లో బోల్షెవిక్ తిరుగుబాటు

1918–20
అంతర్యుద్ధం

1919
కొమింటర్న్ ఏర్పాటు.

1929
భూముల సమీకరణ ప్రారంభం.



*చిత్రం 11* – పెట్రోగ్రాడ్లో కార్మికులతో లెనిన్ (ఎడమ) మరియు ట్రోటస్కీ (కుడి).

AP SCERT

## 4 అక్టోబర్ తర్వాత ఏ మార్పు జరిగింది?

బోల్షివిక్‌లు ప్రైవేట్ ఆస్తులకు పూర్తిగా వ్యతిరేకం. నవంబర్ 1917లో చాలా పరిశ్రమలు, బ్యాంకులను జాతీయం చేసారు. అంటే యాజమాన్యాన్ని, నిర్వహణను ప్రభుత్వం చేపట్టింది. భూమిని సామాజిక ఆస్తిగా ప్రకటించారు. ప్రభువుల భూమిని రైతులను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించారు. నగరాల్లో, కుటుంబ అవసరాలకు అనుగుణంగా పెద్ద గృహాల విభజనను అమలు చేశారు. ఉన్నతవర్గం అని సూచించే మాటలు ఉపయోగించడాన్ని వారు నిషేధించారు. ఈ మార్పులకు ప్రాధాన్యమిస్తూ 1918 లో దుస్తుల పోటీని నిర్వహించి సైనికులకు, అధికారులకు కొత్త యూనిఫారాలు రూపొందించారు, ఆసమయంలోనే సోవియట్ టోపి (బుడియో నోవ్కా) ని ఎంపిక చేశారు.



చిత్రం 12. సోవియట్ టోపీ (బూడియోనోవ్కా) ధరించిన సైనికుడు

బోల్షివిక్ పార్టీని రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ (బోల్షివిక్)గా మార్చారు. నవంబర్ 1917లో, బోల్షివిక్‌లు రాజ్యాంగ సభకు ఎన్నికలను నిర్వహించారు. కాని వారు మెజారిటీ సభ్యులు మద్దతు పొందడంలో విఫలమయ్యారు. 1918 జనవరి లో అసెంబ్లీ బోల్షివిక్ నిర్ణయాలను తిరస్కరించింది. లెనిన్ అసెంబ్లీని రద్దు చేశాడు. అనిశ్చిత పరిస్థితుల్లో ఎన్నుకోబడిన అసెంబ్లీ కంటే ఆల్ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ సోవియట్స్ ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటుందని అతను భావించాడు. తమ మిత్రపక్షాలు వ్యతిరేకించినప్పటికీ మార్చి 1918 లో బోల్షివిక్‌లు బ్రెస్ట్ లిటోవ్స్క్ వద్ద జర్మనీతో శాంతి ఒప్పందం చేసుకున్నారు. తరువాతి సంవత్సరాలలో ఆల్ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ సోవియట్‌లకు జరిగిన ఎన్నికలలో బోల్షివిక్‌లు మాత్రమే పాల్గొన్నారు. ఇదే దేశం యొక్క పార్లమెంటుగా మారింది. రష్యా ఒకే పార్టీ ఉండే దేశంగా మారింది. కార్మిక సంఘాలను పార్టీ నియంత్రణలో ఉంచారు. బోల్షివిక్‌లను విమర్శించే వారిని ఈ రహస్య పోలీసులు (మొదట చెకా అని పిలిచారు, తరువాత OGPU మరియు NKVD) శిక్షించేవారు. మార్పు కోసం, సామ్యవాదం కోసం నిలబడిన పార్టీవైపు ఎంతో మంది యువరచయితలు, కళాకారులు అడుగులు వేశారు. 1917 అక్టోబరు తరువాత ఇది కళలు, వాస్తు శిల్పంలో అనేక ప్రయోగాలకు దారితీసింది. కానీ పార్టీ విధించిన ఆంక్షల కారణంగా అనేక మంది భ్రమలు తొలగిపోయాయి.



చిత్రం 13 – 1918 లో మాస్కోలో మే డే ప్రదర్శన

**పెట్టె 3**

**అక్టోబర్ విప్లవం, రష్యన్ గ్రామీణ ప్రాంతం: రెండు దృక్కోణాలు**

'అక్టోబర్ 25, 1917 నాటి విప్లవ తిరుగుబాటు వార్తలు, మరుసటి రోజు గ్రామానికి చేరుకున్నాయి. దీనిని ప్రజలు ఉత్సాహంతో స్వాగతించారు. తమకు ఉచితంగా భూమి లభిస్తుందని, యుద్ధం ముగుస్తుందని రైతాంగం ఆశించింది. ...వార్త వచ్చిన రోజు, భూస్వామికి చెందిన కోటలాంటి ఇంటిని లూటీ చేసారు, పశువులను జప్తు చేసారు. అతని విస్తారమైన పండ్ల తోటను నరికి కట్టెలుగా రైతులకు విక్రయించారు. అతని సువిశాల భవనాలన్నీ విచ్ఛిన్నమై శిథిలాలుగా మిగిలాయి. సరికొత్త సోవియట్ జీవన విధానాన్ని అనుసరించాలనే రైతులకు ఆ భూమిని పంచిపెట్టారు.

ఆధారం : ఫెదర్ బెలోవ్, ది హిస్టరీ ఆఫ్ ఎ సోవియట్ కలెక్టివ్ ఫార్మ్

భూస్వామి కుటుంబానికి చెందిన సభ్యుడు ఎస్టేట్‌లో ఏమి జరిగిందనే దాని గురించి బంధువుకు ఇలా వ్రాశాడు:

"తిరుగుబాటు" ఎటువంటి బాధను కలిగించకుండా, నిశ్శబ్దంగా, శాంతియుతంగా జరిగింది. మొదట కొన్ని రోజులు భరించలేనంతగా ఉన్నాయి...మిఖైల్ మిఖైలోవిచ్ (ఎస్టేట్ యజమాని) ప్రశాంతంగా ఉన్నాడు...ఆడవాళ్ళు కూడా...ఛైర్మెన్ సరిగ్గా మర్యాదగా ప్రవర్తిస్తాడనే చెప్పాలి. మాకు రెండు ఆవులు, రెండు గుర్రాలు మిగిలాయి. మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దని సేవకులు వారికి చెబుతారు. "వాళ్ళను బ్రతకనివ్వండి. మేము వారి భద్రత, ఆస్తికి హామీ ఇస్తున్నాము. వారిని వీలైనంత మానవీయంగా చూడాలని మేము కోరుకుంటున్నాము ... అనేక గ్రామాలలో కమిటీలను తొలగించి, మిఖాయిల్ మిఖైలోవిచ్‌కు ఎస్టేట్‌ను తిరిగి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు పుకార్లు ఉన్నాయి. ఇది జరుగుతుందో, లేదో అది మనకు మంచిదో కాదో కూడా నాకు తెలియదు. కానీ మన ప్రజలలో మనస్సాక్షి ఉన్నందుకు మేము సంతోషిస్తున్నాము...'

ఆధారం : సెర్జ్ ష్మెమాన్, ఎకోస్ ఆఫ్ ఎ నేటివ్ ల్యాండ్. టూ సెంచరీస్ ఆఫ్ ఎ రష్యన్ విలేజ్ (1997).

## 4.1 అంతర్యుద్ధం

బోల్షెవిక్‌లు భూమి పునఃపంపిణీకి ఆదేశించినప్పుడు, రష్యన్ సైన్యం విచ్ఛిన్నం కావడం ప్రారంభమైయింది. సైనికులు ముఖ్యంగా రైతులు, పునఃపంపిణీ కోసం ఇంటికి వెళ్లాలని, అంతేకాకుండా సైన్యం నుండి వైదొలగాలని అనుకున్నారు. బోల్షివిక్‌లుకాని సామ్యవాదులు, ఉదారవాదులు, నిరంకుశత్వాన్ని సమర్థించేవారు. బోల్షివిక్‌ల తిరుగుబాటును ఖండించారు. వీరి నాయకులు దక్షిణ రష్యాకు వెళ్ళి బోల్షెవిక్‌లతో ('రెడ్స్') పోరాడటానికి దళాలను ఏర్పాటు చేశారు. 1918 – 1919 మధ్య కాలంలో, 'గ్రీన్స్' (సామ్యవాద విప్లవకారులు), వైట్స్ (జార్‌లను సమర్థించేవారు). రష్యా సామ్రాజ్యంలో ఎక్కువ భాగాన్ని నియంత్రించారు. రష్యాలో సామ్యవాదం ఎదుగుదలపై ఆందోళన చెందుతున్న ఫ్రెంచ్, అమెరికన్, బ్రిటీష్, జపాన్ దళాలు మద్దతు ఇచ్చాయి. బోల్షెవిక్‌లకు దళాలకు మధ్య జరిగిన అంతర్యుద్ధంలో దోపిడీ, బందిపోటు, కరువు సర్వసాధారణమయ్యాయి.

జార్ మద్దతుదారులలో ప్రైవేట్ ఆస్తులను సమర్థించేవారు భూమిని స్వాధీనం చేసుకున్న రైతులపై కఠినమైన చర్యలు తీసుకున్నారు. ఇటువంటి చర్యలు బోల్షివిక్‌లు కాని వారు ప్రజాదరణను కోల్పోవడానికి దారితీశాయి. 1920 జనవరి నాటికి పాత రష్యన్ సామ్రాజ్యాన్ని చాలా వరకు బోల్ష్విక్‌లు నియంత్రించారు. రష్యాయేతర జాతీయులు, ముస్లింలు, జాడిడిస్టుల సహకారం వలన వారు విజయం సాధించారు.

### కృత్యం

గ్రామీణ విప్లవంపై రెండు అభిప్రాయాలను చదవండి. సంఘటనలకు మీరే సాక్షిగా ఊహించుకోండి.

1) ఎస్టేట్ యజమాని

2) చిన్నరైతు

3) పత్రిక విలేఖరిగా అనాటి ఘటనల గురించి క్లుప్తంగా రాయండి.

AP SCERT

రష్యా వలసవాదులు తమకు తాముగా బోల్షివిక్‌గా మారిన చోట సహకారం పని చేయలేదు. ఖివాలో, మధ్య ఆసియాలో బోల్షివిక్ వలసవాదులు సామ్యవాదాన్ని రక్షించే పేరుతో స్థానిక జాతీయవాదులను దారుణంగా ఊచకోత కోశారు. ఈ పరిస్థితిలో, బోల్షెవిక్ ప్రభుత్వం దేనికి ప్రాతినిధ్యం వహిస్తుందనే దానిపై చాలా మంది గందరగోళానికి గురయ్యారు.

పాక్షికంగా దీనిని పరిష్కరించడానికి, చాలా మంది రష్యనేతర జాతీయులకు సోవియట్ యూనియన్ (USSR)లో రాజకీయ **స్వయంప్రతిపత్తి** ఇచ్చారు – 1922లో బోల్షివిక్‌లు రష్యన్ సామ్రాజ్యం నుండి సోవియట్ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. **సంచార జీవనాన్ని** నిలిపివేయాలనే – కఠినమైన ఆదేశాలవంటి జనాదరణలేని విధానాలను అనుసరించమని బోల్షివిక్‌లు స్థానిక ప్రభుత్వాన్ని బలవంతం చేశారు. దీనివలన వివిధ జాతీయుల విశ్వాసాన్ని గెలుచుకునే ప్రయత్నాలు పాక్షికంగా మాత్రమే విజయవంతమయ్యాయి.

### కొత్త పదాలు

స్వయంప్రతిపత్తి – తమను తాము పరిపాలించుకునే హక్కు

సంచారవాదం – ఒకే చోట నివసించకుండా తమ జీవనోపాధి కోసం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళే వారి జీవన విధానం.

## కృత్యం

మధ్య ఆసియా ప్రజలు రష్యా విప్లవం పట్ల ఎందుకు విభిన్నంగా స్పందించారు?

**మూలం B**

**అక్టోబర్ విప్లవ కాలంలో మధ్య ఆసియా : రెండు అభిప్రాయాలు**

M.N.రాయ్ ఒక భారతీయ విప్లవకారుడు, మెక్సికన్ కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకుడు. భారతదేశం, చైనా, ఐరోపాలో ప్రముఖ కామింటర్న్ నాయకుడు. 1920లలో అంతర్యుద్ధం జరుగుతున్న సమయంలో అతను మధ్య ఆసియాలో ఉండి ఇలా వ్రాశాడు:

గ్రామపెద్ద ఉదారభావాలు గల వృద్ధుడు. రష్యన్ భాష మాట్లాడే యువకుడు అతని సహాయకుడు. తన మాతృభూమి కిర్గిజ్‌లు జయించిన సైన్యాధికారులను పారద్రోలిన, జార్‌ను పదవీచ్యుతుని చేసిన విప్లవం గురించి విన్నాడు. ఇప్పుడు కిర్గిజ్‌లు తమ మాతృభూమికి తామే పాలకులయ్యారు. విప్లవమంటే ఇదే. విప్లవం వర్ధిల్లాలి. 'అని అతడు నినాదం చేశాడు. అతనినే మొదటి బోల్షివిక్‌గా భావించవచ్చు. ఆ తరువాత ఆ జాతి మొత్తం చేరిపోయింది.

*M.N.Roy, Memoirs (1964).*

'కిర్గిజ్‌లు మొదటి విప్లవాన్ని (అంటే ఫిబ్రవరి విప్లవం) ఆనందంతో స్వాగతించారు. ఈ రెండవ విప్లవం దిగ్భ్రాంతి, భయాందోళనలకు గురిచేసింది... మొదటి విప్లవం వారిని జారిస్ట్ పాలన అణచివేత నుండి విముక్తి చేసింది... స్వయంప్రతిపత్తి సాకారం అవుతుందనే వారి ఆశను బలపరిచింది. రెండవ విప్లవం (అక్టోబర్ విప్లవం) హింస, దోపిడీ, పన్నులు, నియంతృత్వ అధికార స్థాపనతో కూడి ఉంది... ఒకసారి జారిస్ట్ బ్యూరోక్రాట్ల యొక్క చిన్న సమూహం కిర్గిజ్‌లను అణచివేసింది. అదే సమూహ ప్రజలు అదే పాలనను కొనసాగించారు ...'

*1919లో కజఖ్ నాయకుడు, Alexander Bennigsen and Chantal Quelquejay, Les Mouvements Nationaux chez les Musulmans de Russie, (1960). (1960)లో ఉదహరించారు.*

మూలం

AP SCERT

## 4.2 సామ్యవాద సమాజాన్ని ఏర్పాటు చేయుట

అంతర్యుద్ధం సమయంలో, బోల్షెవిక్‌లు పరిశ్రమలు, బ్యాంకులను జాతీయీకరించారు. సాంఘికీకరించబడిన భూమిని సాగు చేసుకోవడానికి వారు రైతులను అనుమతించారు. స్వాధీనం చేసుకున్న భూమిలో సమిష్టిగా పనిచేస్తే ఎలా ఉంటుందో చూపడానికి బోల్షెవిక్‌లు దీనిని ఉపయోగించారు.

కేంద్రీకృత ప్రణాళిక ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఆర్థిక వ్యవస్థ ఎలా పని చేయగలదో అంచనా వేసిన అధికారులు ఐదేళ్ల కాలానికి లక్ష్యాలను నిర్దేశించారు. దీని ఆధారంగా వారు పంచవర్ష ప్రణాళికలను రూపొందించారు. మొదటి రెండు ప్రణాళికలలో (1927–1932, 1933–1938) సమయంలో పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడానికి

**పెట్టె 4**

**ఉక్రెయిన్‌లోని ఒక గ్రామంలో సోషలిస్ట్ సాగు**

'రెండు [స్వాధీనం చేసుకున్న] పొలాలను స్థావరంగా ఉపయోగించి ఒక కమ్యూన్ ఏర్పాటు చేసారు. ఈ కమ్యూన్‌లో మొత్తం డెబ్బై మంది వ్యక్తులతో కూడిన పదమూడు కుటుంబాలు ఉన్నాయి.... వ్యవసాయ పనిముట్లను సేకరించారు ... పొలాలు కమ్యూన్‌కు మార్చారు ... సభ్యులు కమ్యూన్ హాలులో తిన్నారు మరియు ఆదాయాన్ని "సహకార కమ్యూనిజం" సూత్రాలకు అనుగుణంగా విభజించారు. సభ్యుల శ్రమ మొత్తం ఆదాయం, అలాగే కమ్యూన్‌కు చెందిన అన్ని నివాసాలు, సౌకర్యాలను కమ్యూన్ సభ్యులు పంచుకున్నారు.

ఫెడోర్ బెలోవ్, ది హిస్టరీ ఆఫ్ ఎ సోవియట్ కలెక్టివ్ ఫార్మ్ (1955).

అన్ని ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రీకృత ప్రణాళిక ఆర్థిక వృద్ధికి దారితీసింది. పారిశ్రామిక ఉత్పత్తి పెరిగింది (1929 – 1933 మధ్య చమురు, బొగ్గు, ఉక్కు విషయంలో 100 శాతం). నూతన పారిశ్రామిక నగరాలు ఆవిర్భవించాయి.




చిత్రం.14 – కర్మాగారాలు సామ్యవాదానికి చిహ్నాలుగా మారాయి.
ఈ పోస్టర్ ఇలా పేర్కొంది: 'చిమ్నీల నుండి వచ్చే పొగ సోవియట్ రష్యా యొక్క శ్వాస.'

అయినప్పటికీ, వేగవంతమైన నిర్మాణం వల్ల పని పరిస్థితులు అధ్వానంగా మారాయి. మాగ్నిటోగోర్స్క్ నగరంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం మూడేళ్లలో పూర్తయింది. కార్మికులు కష్టతరమైన జీవితాలను గడిపారు. దీని ఫలితంగా మొదటి సంవత్సరంలోనే 550 సార్లు పని నిల్చిపోయింది. నివాస గృహాలలో 'చలికాలంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీల కంటే తక్కువగా ఉండేది. ప్రజలు మరుగుదొడ్లకు వెళ్ళవలసి వస్తే నాలుగు అంతస్తులు క్రిందికి దిగి వీధికి అవతలవైపుకు పరిగెత్తవలసి వచ్చేది'.

పాఠశాల వ్యవస్థను విస్తరించి అభివృద్ధి చేశారు. ఫ్యాక్టరీ కార్మికులు, రైతులు విశ్వవిద్యాలయాలలోకి ప్రవేశించడానికి ఏర్పాట్లు చేసారు. మహిళా కార్మికుల పిల్లల కోసం ఫ్యాక్టరీల్లో శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుకే ప్రజారోగ్యం, సంరక్షణను అందించారు. కార్మికులకు ఆదర్శ గృహ వసతిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వద్ద పరిమిత వనరులు ఉన్నందున దీని ప్రభావం అసమానంగా ఉంది.

AP SCERT



చిత్రం.15 – 1930లలో సోవియట్ రష్యాలోని పాఠశాలలో పిల్లలు.
వారు సోవియట్ ఆర్థిక వ్యవస్థను చదువుతున్నారు.



చిత్రం..16 – మొదటి పంచవర్ష ప్రణాళికలో మాగ్నిటోగోర్స్క్‌లో ఒక పిల్లవాడు.
అతను సోవియట్ రష్యా కోసం పని చేస్తున్నాడు.



చిత్రం.17 – 1930లలో ఫ్యాక్టరీ భోజనశాల

APSCERT

మూలం C

**1933లో సోవియట్‌లో బాల్యం యొక్క కలలు, వాస్తవాలు**

ప్రియమైన తాత కాలినిన్ ...

నా కుటుంబం పెద్దది, నలుగురు పిల్లలు ఉన్నారు. మాకు తండ్రి లేరు – కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతూ అతను చనిపోయాడు. మా అమ్మ అనారోగ్యంతో ఉంది ... నేను బాగా చదువుకోవాలనుకుంటున్నాను, కానీ నేను పాఠశాలకు వెళ్లలేను. నా దగ్గర కొన్ని పాత బూట్లు ఉన్నాయి, కానీ అవి పూర్తిగా చిరిగిపోయాయి, వాటిని ఎవరూ సరిచేయలేరు. మా అమ్మ అనారోగ్యంతో ఉంది, మాకు డబ్బు లేదు, తిండి లేదు, కానీ నాకు చాలా చదువుకోవాలని ఉంది.... చదువు.....చదువు.....చదువు...... అనే మూడు పనులు మా ముందు ఉన్న లక్ష్యాలు అని వ్లాదిమిర్ ఇలిచ్ లెనిన్ అన్నారు. కానీ నేను పాఠశాలకు వెళ్లడం మానేయాలి. మాకు బంధువులు లేరు. మాకు సహాయం చేయడానికి ఎవరూ లేరు, కాబట్టి నేను కుటుంబం పస్తులు ఉండకుండా ఉండటానికి ఫ్యాక్టరీలో పనికి వెళ్లాలి. ప్రియమైన తాతయ్యా, నా వయస్సు 13, నేను బాగా చదువుతున్నాను. నాగురించి చెడు నివేదికలు లేవు. నేను 5వ తరగతిలో ఉన్నాను...

సోవియట్ ప్రెసిడెంట్ కాలినిన్‌కు 13 ఏళ్ల ఉద్యోగి నుండి 1933లో లేఖ.

V. సోకోలోవ్ (ed), Obshchestvo I Vlast, v 1930-ye gody (మాస్కో, 1997).

మూలం

## 4.3 స్టాలినిజం, సమిష్టితత్వం



ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ ప్రారంభ కాలం వ్యవసాయం సమిష్టి విపత్తులతో ముడిపడి ఉంది. 1927-1928 నాటికి, సోవియట్ రష్యాలోని పట్టణాలు ధాన్యం సరఫరాలో తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నాయి. ధాన్యాన్ని ఏ ధరకు అమ్మాలో ప్రభుత్వం నిర్ణయించేది, అయితే రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలుదారులకు ఈ ధరలకు విక్రయించడానికి నిరాకరించారు.

లెనిన్ మరణం తర్వాత పార్టీకి నాయకత్వం వహించిన స్టాలిన్ కఠిన అత్యవసర చర్యలను ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని ధనిక రైతులు, వ్యాపారులు అధిక ధరల ఆశతో నిల్వచేశారని అతను భావించాడు. స్పెక్యులేషన్‌ను ఆపివేశారు, నిల్వలను స్వాధీనం చేసుకున్నాడు.

1928లో, పార్టీ సభ్యులు ధాన్యం ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో పర్యటించారు. బలవంతంగా ధాన్యం సేకరణను పర్యవేక్షించారు. సంపన్న రైతులు 'కులక్స్'పై దాడి చేశారు - కొరత కొనసాగుతుండటంతో వ్యవసాయ క్షేత్రాలను సమీకృతం చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. వ్యవసాయ క్షేత్రాలు చిన్నవిగా ఉండడం వల్ల ధాన్య కొరత ఉందని వాదించారు. 1917 తరువాత, రైతులకు భూమి ఇచ్చారు. చిన్న వ్యవసాయ క్షేత్ర రైతులు పొలాలను ఆధునికీకరించలేక పోయారు. ఆధునిక వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేయాలంటే, యంత్రాలను పారిశ్రామిక పద్ధతిలో సాగు చేయడానికి ఉపయోగించాలి. 'కులాక్‌లను తొలగించడం' అవసరం. రైతుల నుండి భూమిని స్వాధీనం చేసుకోవడం, ప్రభుత్వ నియంత్రణలో ఉండే పెద్ద వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేయడం అవసరం.

ఆ తరువాత స్టాలిన్ ఉమ్మడి క్షేత్రాల కార్యక్రమం కొనసాగింది. 1929 నుండి రైతులందరినీ ఉమ్మడి క్షేత్రంలో (కోల్‌ఖోజ్) సాగు చేయమని పార్టీ వత్తిడి చేసింది. ఎక్కువ భాగం భూమిని, పనిముట్లను ఉమ్మడి క్షేత్రాల యాజమాన్యానికి బదిలీ చేశారు. భూమి కొరకు రైతులు పొలాల్లో పనిచేసారు, కోల్‌ఖోజ్‌లో వచ్చిన లాభాలను పంచుకున్నారు. దీనితో కోపోద్రిక్తులైన రైతులు సంబంధిత అధికారులను ఎదిరించి పశుసంపదను నాశనం చేశారు. 1929 - 1931 మధ్య, పశువుల సంఖ్య మూడింట ఒక వంతు పడిపోయింది. సమిష్టితత్వాన్ని ప్రతిఘటించిన వారిని కఠినంగా శిక్షించారు. చాలా మందిని దేశం నుండి బహిష్కరించారు. అజ్ఞాత వాసంలోకి పంపారు. సమిష్టితత్వాన్ని ప్రతిఘటించిన రైతులు తాము ధనవంతులు కాదని, సామ్యవాదానికి వ్యతిరేకం కాదని వాదించారు. కేవలం కొన్ని కారణాల వల్ల ఉమ్మడి క్షేత్రాలలో పని చేయడానికి ఇష్టపడలేదు. స్టాలిన్ ప్రభుత్వం కొంత స్వతంత్ర సాగును అనుమతించింది. కానీ అలాంటి సాగుదారుల పట్ల కఠిన వైఖరిని ప్రదర్శించింది.

సమిష్టితత్వంలో కూడా ఉత్పత్తి వెంటనే పెరగలేదు. 1930-1933 నాటికి పంటలు సరిగా పండకపోవడంతో సోవియట్ చరిత్రలో అత్యంత దారుణమైన కరువు సంభవించి 4 మిలియన్లకు పైగా ప్రజలు మరణించారు.

**కొత్త పదాలు**

బహిష్కరించారు - ఒకరిని స్వంత దేశం నుండి బలవంతంగా తొలగించడం.

బహిష్కరించబడ్డారు - ఒకరిని స్వంత దేశం నుండి దూరంగా జీవించేలా బలవంతంచేయడం.




*చిత్రం 18 - సమిష్టి వ్యవసాయం సమయంలో ఒక పోస్టర్.* ఇది ఇలా పేర్కొంది: 'సాగు తగ్గించడం కోసం ప్రయత్నిస్తున్న కులక్‌పై సమ్మె చేస్తాం.



*చిత్రం 19 - అతిపెద్ద సామూహిక పొలాలలో పని చేయడానికి రైతు స్త్రీలు గుమిగూడారు.*

AP SCERT

మూలం D

**సమీకృతంపై వ్యతిరేకత, ప్రభుత్వ ప్రతిస్పందనపై అధికారిక అభిప్రాయం**

'సమీకృత విధానం పరిచయం చేయుట, వసంత కాలం పంటకు సన్నద్ధం చేయుటకు పార్టీలోని దిగువ స్థాయి శ్రేణిలోని ఒక విభాగం వక్రీకరించడం వలన ఫిబ్రవరి రెండవ భాగం నుండి ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాలలో రైతుల సామూహిక తిరుగుబాటు ఆరంభమైంది.

అతి తక్కువ వ్యవధిలో పైన తెలిపిన ప్రాంతాల నుండి ఇరుగు పొరుగు గ్రామాలకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు విస్తరించాయి – సరిహద్దుల వద్ద దారుణమైన తిరుగుబాటు జరిగింది.

రైతు తిరుగుబాట్లలో ఎక్కువ భాగం ధాన్యం, పశుసంపద, పనిముట్ల సమూహ నిల్వలను... తిరిగి ఇవ్వాలనే స్పష్టమైన డిమాండ్లతో ముడిపడి ఉంది.

ఫిబ్రవరి 1 మరియు మార్చి 15 మధ్య, 25,000 మందిని అరెస్టు చేశారు ... 656 మందిని ఉరితీశారు, 3673 మందిని కార్మిక శిబిరాల్లో ఖైదు చేశారు. 5580 మంది బహిష్కరించారు....'

K.M. Karlson నివేదిక. కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీకి చెందిన ఉక్రెయిన్‌లు రాష్ట్ర పోలీస్ పరిపాలన అధ్యక్షుడు 19 మార్చి 1930.

V. Sokolov (ed), *Obshchestvo I Vlast, v 1930-ye gody* నుండి

ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామికోత్పత్తిలో గందరగోళం సమిష్టితత్వం యొక్క పరిణామాలను పార్టీలోని చాలా మంది సభ్యులు విమర్శించారు. స్టాలిన్ అతని మద్ధతుదారులు దీనిని సామ్యవాదంపై జరిగిన కుట్రగా ఆరోపించారు. 1939 నాటికి, దేశం మొత్తం మీద 2 మిలియన్లకు పైగా ప్రజలపై నేరారోపణలు మోపి జైళ్ళలో పెట్టారు. కార్మిక శిబిరాలకు తరలించారు. వీరిలో చాలా మంది నేరాలకు పాల్పడని అమాయకులు. కానీ వారి పక్షాన ఎవరూ మాట్లాడలేదు. చాలా మంది చిత్రహింసల వల్ల తప్పును ఒప్పుకోవలసి వచ్చింది, ఉరితీయబడ్డారు. – వారిలో చాలా మంది ప్రతిభావంతులైన నిపుణులు ఉన్నారు.

మూలం E

ఇది సామూహిక వ్యవసాయంలో చేరడం ఇష్టం లేని ఓ రైతు *Krestianskaia Gazeta* (రైతు వార్తాపత్రిక) కు రాసిన లేఖ.

'... నేను 1879లో జన్మించిన సహజంగా పనిచేసుకునే రైతును ... మా కుటుంబంలో 6 మంది సభ్యులు ఉన్నారు. నా భార్య 1881లో జన్మించింది. నా కుమారుడు 16, ఇద్దరు కుమార్తెలు 19 సంవత్సరాల వయస్సు వారు. ఈ ముగ్గురూ పాఠశాలకు వెళతారు. నా సోదరి వయస్సు 71. 1932 నుండి నాపై భారీ పన్నులు విధించారు. ఇది నాకు అసాధ్యమనిపించింది. 1935 నుండి స్థానిక అధికారులు నాపై పన్నులు పెంచారు ... నేను వాటిని చెల్లించలేకపోయాను. నా ఆస్తి మొత్తం నమోదు చేయబడింది: నా గుర్రం, ఆవు, దూడ, గొర్రెలు వాటి పిల్లలతోసహా, నా పనిముట్లు, ఫర్నిచర్, భవన మరమ్మత్తు కోసం ఉంచుకున్న కలప నిల్వలు అన్నింటిని వారు పన్నుల కోసం అమ్మేశారు. 1936లో, వారు నా రెండు భవనాలను విక్రయించారు ... కోల్‌ఖోజ్ వాటిని కొనుగోలు చేశారు. 1937లో నాకున్న రెండు పూరిళ్ళలో ఒకటి విక్రయించబడింది మరొకటి జప్తు చేయబడింది ...

Afanasii Dedorovich Frebenev, ఒక స్వతంత్ర సాగుదారు.

V. Sokolov (ed), *Obshchestvo I Vlast, v 1930-ye gody* నుండి

# 5 ప్రపంచంపై రష్యన్ విప్లవం ప్రభావం మరియు USSR

యూరప్‌లో అప్పటికే ఉన్న సోషలిస్టు పార్టీలు బోల్షెవిక్‌లు అధికారాన్ని చేజిక్కించుకున్న విధానాన్ని – దానిని నడిపిస్తున్న పద్ధతిని పూర్తిగా ఆమోదించలేదు. ఏది ఏమైనప్పటికీ, కార్మిక రాజ్యం ఏర్పడటానికి అవకాశం ఉందనే భావన ప్రపంచమంతా దావానంలా వ్యాపించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ – లాగా అనేక దేశాలలో, కమ్యూనిస్ట్ పార్టీలు ఆవిర్భవించాయి. తమ విధానాన్ని అనుసరించమని వలసరాజ్య ప్రజలను బోల్షెవిక్‌లు ప్రోత్సహించారు. USSR వెలుపల ఉన్న అనేక మంది రష్యనేతరులు తూర్పు ప్రజల సమావేశం (1920)లో పాల్గొన్నారు. బోల్షెవిక్‌లు కమిటర్న్ (అంతర్జాతీయ సామ్యవాద బోల్షెవిక్ మద్దతుదారుల సమాఖ్య) ఏర్పాటుచేశారు. కొంతమంది USSR యొక్క కమ్యూనిస్ట్ యూనివర్శిటీ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ ది ఈస్ట్‌లో విద్యను అభ్యసించారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే సమయానికి, USSR సామ్యవాదాన్ని ప్రపంచ ముఖచిత్రం పైకి తెచ్చింది. ప్రపంచ స్థాయి గుర్తింపునిచ్చింది.

అయినప్పటికీ 1950ల నాటికి USSR లో ప్రభుత్వ పనితీరు రష్యన్ విప్లవ ఆశయాలకు అనుగుణంగా లేదని ఆ దేశంలోనే గుర్తించారు. సోవియట్ యూనియన్‌లో అన్నీ సరిగా లేవని ప్రపంచ సామ్యవాద ఉద్యమాలు కూడా గుర్తించాయి. వెనుకబడిన దేశం గొప్ప శక్తిగా మారింది. దాని పరిశ్రమలు, వ్యవసాయం అభివృద్ధిచెందాయి. పేదలకు ఆహారం సమకూర్చింది. కానీ అది తన పౌరులకు అవసరమైన స్వేచ్ఛను హరించింది. నిర్బంధ విధానాల ద్వారా దాని అభివృద్ధి పథకాలను నిర్వహించింది. ఇరవయ్యవ శతాబ్దం చివరినాటికి, సామ్యవాద దేశంగా USSR యొక్క అంతర్జాతీయ ఖ్యాతి క్షీణించింది. అయినప్పటికీ సామ్యవాద భావాలు ఇప్పటికీ దాని ప్రజలలో గౌరవాన్ని పొందుతున్నాయని గుర్తించబడింది. కానీ ప్రతి దేశంలోను సామ్యవాద భావనలను వివిధ రకాలుగా పునరాలోచించారు.

AP SCERT

**పెట్టె 5**

**భారతదేశంలో రష్యన్ విప్లవం గురించిన రచనలు**

చాలామంది భారతీయులపై రష్యన్ విప్లవం ప్రభావం పడింది. చాలా మంది కమ్యూనిస్ట్ యూనివర్సిటీకి హాజరయ్యారు. 1920ల మధ్య నాటికి భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. దాని సభ్యులు సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీతో సన్నిహితంగా ఉన్నారు. భారత రాజకీయ సాంస్కృతిక ప్రముఖులు సోవియట్ చర్యల పట్ల ఆసక్తిని కనబరిచారు, రష్యాను సందర్శించారు. వారిలో సోవియట్ సోషలిజం గురించి వ్రాసిన జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్ ఉన్నారు. భారతదేశపు రచనలలో సోవియట్ రష్యా జాడలు కన్పించాయి. 1920–21లో ఆర్. ఎస్. అవస్తి రష్యన్ విప్లవం – లెనిన్ అతని జీవితం, అతని ఆలోచనలు, తరువాత కాలంలో ది రెడ్ రెవల్యూషన్‌ను హిందీలో రాశారు. ఎస్.డి. విద్యాలంకార్ ద రీబర్త్ ఆఫ్ రష్యా, ద సోవియట్ స్టేట్ ఆఫ్ రష్యాను రాశారు. బెంగాలీ, మరాఠీ, మలయాళం, తమిళం, తెలుగు భాషలలో మరిన్ని రాశారు.




***చిత్రం 20 – లెనిన్‌పై ఇండో-సోవియట్ జర్నల్ యొక్క ప్రత్యేక సంచిక.***

*భారతీయ సామ్యవాదులు రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో USSR కు మద్దతు సమీకరించారు.*

మూలం F

**1920లో ఒక భారతీయుడు సోవియట్ రష్యాకు వచ్చాడు**

'మా జీవితంలో మొదటిసారిగా, యూరోపియన్లు ఆసియన్లతో స్వేచ్ఛగా కలిసిమెలసి ఉండడం చూశాం. దేశంలోని మిగిలిన ప్రజలతో రష్యన్లు స్వేచ్ఛగా కలిసిపోవడం చూసినప్పుడు, మేము నిజమైన సమానత్వపు గడ్డకు వచ్చామనిపించింది.

నేను స్వేచ్ఛ యొక్క నిజమైన ప్రకాశమును చూశాను. ప్రతివిప్లవకారులు, సామ్రాజ్యవాదులు విధించిన పేదరికం ఉన్నప్పటికీ, ప్రజలు గతంలో కంటే మిక్కిలి సంతోషంగాను, సంతృప్తిగాను ఉన్నారు. ఈ విప్లవం వారిలో విశ్వాసాన్ని, నిర్భయతను నింపింది. ఈ యాభై విభిన్న దేశాల ప్రజల మధ్య మానవజాతి యొక్క నిజమైన సౌభ్రాతృత్వం కనిపిస్తుంది. ఒకరితో ఒకరు స్వేచ్ఛగా కలిసిపోవడానికి కులమతాలు అడ్డంకులు కాలేదు. ప్రతి వ్యక్తి ఒక వక్తగా మారాడు. ప్రతి ఒక కార్మికుడు, రైతు, సైనికుడు నైపుణ్యం గల ఉపన్యాసకుడు అవడం ప్రతి ఒక్కరూ చూడవచ్చు.'

*షౌకత్ ఉస్మానీ, ఒక విప్లవకారుడి చారిత్రక యాత్రలు.*

మూలం G

**1930లో రవీంద్రనాథ్ ఠాగూర్ రష్యా నుండి ఇలా వ్రాశాడు.**

'ఇతర యూరోపియన్ రాజధానుల కంటే మాస్కోలో పరిశుభ్రత చాలా తక్కువగా ఉంది. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ఎవరూ తాపత్రయపడటంలేదు. భూమి మొత్తం కార్మికులదే... ఇక్కడ ప్రజలు పెద్దమనుషుల పంచన ఉండాలని ఆశించరు. సంవత్సరాల తరబడి అజ్ఞాతంలో ఉండిపోయిన వారు నేడు వ్యక్తమయ్యారు... నేను, నా దేశ రైతులు, కార్మికుల గురించి ఆలోచించాను. ఇదంతా అరేబియన్ నైట్స్ లోని జినీ చర్యలలా అనిపించాయి. (ఇక్కడ) ఒక దశాబ్దం క్రితం వారు కూడా మన వారిలాగే నిరక్షరాస్యులు, అసహాయులు, ఆకలితో అలమటించేవారు... ఈ కొద్ది సంవత్సరాలలోనే అనంతమైన అజ్ఞానాన్ని, అసహాయతను తొలగించబడిన విధానం చూసి నాలాంటి అసహాయ భారతీయుడు ఆశ్చర్యపోక ఏమి చేస్తాడు.

## కృత్యం

షౌకత్ ఉస్మానీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన పేరాలను పోల్చండి. C, D మరియు E. మూలాలకు సంబంధించిన వాటితో కలిపి చదవండి.

- USSR గురించి భారతీయులకు ఏమి నచ్చింది?
- రచయితలు ఏమి కనుగొనలేకపోయారు?

AP SCERT

## కృత్యాలు

1. మీరు 1905లో సమ్మె చేస్తున్న కార్మికుడిగా ఊహించుకోండి, మీ తిరుగుబాటు చర్యలపై కోర్టులో విచారణ జరుగుతోంది. మిమ్మల్ని సమర్థించుకుంటూ మీరు చేసే ప్రసంగాన్ని రూపొందించండి. మీ తరగతిలో హావభావాలతో ప్రసంగించండి.
2. కింది వార్తాపత్రికలకు 24 అక్టోబర్ 1917 తిరుగుబాటు గురించి ముఖ్యాంశాలు, సంక్షిప్త వార్తను వ్రాయండి.
    - ఫ్రాన్స్‌లోని ఒక కన్జర్వేటివ్ పేపర్
    - బ్రిటన్‌లోని రాడికల్ వార్తాపత్రిక
    - రష్యాలోని బోల్షెవిక్ వార్తాపత్రిక
3. మీరు రష్యాలో సమీకృత విధానం తర్వాత మధ్యస్థాయి గోధుమ రైతు అని ఊహించుకోండి. సమీకృత విధానంపై మీ అభ్యంతరాలను వివరిస్తూ స్టాలిన్‌కి లేఖ రాయాలని మీరు నిర్ణయించుకున్నారు. మీ జీవిత పరిస్థితుల గురించి మీరు ఏమి వ్రాస్తారు? అలాంటి రైతు పట్ల స్టాలిన్ ఎలాంటి సమాధానం చెబుతారని మీరు అనుకుంటున్నారు?

## ప్రశ్నలు

1. 1905కి ముందు రష్యాలో సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ పరిస్థితులు ఏమిటి?
2. 1917కి ముందు ఐరోపాలోని ఇతర దేశాల కంటే రష్యాలోని శ్రామిక జనాభా ఏ విధంగా భిన్నంగా ఉన్నారు?
3. 1917లో జారిస్ట్ నిరంకుశ పాలన ఎందుకు కూలిపోయింది?
4. రెండు జాబితాలను రూపొందించండి: ఒకటి ఫిబ్రవరి విప్లవం యొక్క ప్రధాన సంఘటనలు దాని ప్రభావం మరియు మరొకటి అక్టోబర్ విప్లవం యొక్క ప్రధాన సంఘటనలు, దాని ప్రభావం ప్రతి ఒక్క సంఘటనలో ఎవరు పాలుపంచుకున్నారు, ఎవరు నాయకులు మరియు సోవియట్ చరిత్రపై ప్రతి ఒక్కరి ప్రభావం ఏమిటో ఒక పేరా వ్రాయండి.
5. అక్టోబర్ విప్లవం తర్వాత వెంటనే బోల్షెవిక్‌లు తీసుకువచ్చిన ప్రధాన మార్పులు ఏమిటి?
6. ఈ కింది వాటి గురించి మీకు తెలిసిన కొన్ని విషయాలను గూర్చి కొన్ని పంక్తులను వ్రాయండి.
    - ధనిక రైతులు
    - డ్యూమా
    - 1900, 1930 మధ్య డ్యూమా మహిళా కార్మికులు
    - ఉదారవాదులు
    - స్టాలిన్ సమీకృత వ్యవసాయ కార్యక్రమం
7. ప్రక్కన ఉన్న ప్రపంచ పటంలో ఈ ప్రదేశాలను గుర్తించండి.

    ఎ) 1917 విప్లవం జరిగిన దేశం.

    బి) 'మార్సెసెలీ' అనే యుద్ధగీతం ఉన్న దేశం.

    సి) యూరప్‌లో పారిశ్రామిక విప్లవం మొదట ప్రారంభమైన దేశం.

AP SCERT

# Democratic Politics - I
# ప్రజాస్వామ్య రాజకీయాలు - I

## Semester - 1

## CONTENTS


| | | |
|---|---|---|
| **CHAPTER 1**<br>WHAT IS DEMOCRACY? WHY DEMOCRACY?<br>ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? ప్రజాస్వామ్యం ఎందుకు? | July<br>జులై | 158 |
| **CHAPTER 2**<br>CONSTITUTIONAL DESIGN<br>రాజ్యాంగ రూపకల్పన | September<br>సెప్టెంబర్ | 192 |
| **CHAPTER 3**<br>ELECTORAL POLITICS<br>ఎన్నికల రాజకీయాలు | October<br>అక్టోబర్ | 224 |


AP SCERT

J6P9L6

Student Corner

W3B4B2

Teacher Corner

# అభ్యసన ఫలితాలు

**విద్యార్థులు**

**1. ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? ప్రజాస్వామ్యం ఎందుకు?**

1. ప్రజాస్వామ్యం దాని లక్షణాలను అర్థం చేసుకుంటారు.
2. ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల ప్రభుత్వాలను పరిశీలిస్తారు.
3. ప్రజాస్వామ్యం, రాజరికం మరియు నియంతృత్వాల మధ్య తేడాలను వివరిస్తారు.
4. సమ న్యాయం మరియు హక్కులను ప్రశంసిస్తారు.

**2. రాజ్యాంగ రూపకల్పన**

1. వర్ణవివక్ష భావనను వివరిస్తారు.
2. రాజ్యాంగం యొక్క ఆవశ్యకత మరియు రాజ్యాంగాన్ని రూపొందించడంలో జరిగిన ప్రయత్నాలను అర్థం చేసుకుంటారు.
3. భారత రాజ్యాంగాన్ని ఇతర దేశాలతో పోల్చుతారు.
4. రాజ్యాంగం యొక్క తత్వాన్ని వివరిస్తారు.
5. భారత రాజ్యాంగం యొక్క మార్గదర్శక విలువలను వివరిస్తూ, రాజ్యాంగ సభ చేసిన కృషిని అభినందిస్తారు.

**3. ఎన్నికల రాజకీయాలు**

1. ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర మరియు దాని ఆవశ్యకతను అర్థం చేసుకుంటారు.
2. ఎన్నికల ప్రక్రియను మరియు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఎన్నికల సంఘం పాత్రను విశ్లేషిస్తారు.
3. పౌరసత్వం భావనను నిర్వచిస్తారు.
4. ఎన్నికల నియోజకవర్గాల భౌగోళిక ప్రాముఖ్యతను వివరిస్తారు.
5. తరగతి నాయకులను మరియు పాఠశాల విద్యార్థి నాయకులను ఎన్నుకోవడానికి నమూనా ఎన్నికలను నిర్వహిస్తారు.
6. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడంలో గల సవాళ్ళను ఎదుర్కోవడంలోని సున్నితత్వాన్ని గ్రహిస్తారు.

AP SCERT